


ఏలూరు **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 35.0
కనిష్ఠం : 25.0

జీఎస్టీ జోష్!



ఏలూరు,సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో చేపట్టిన జీఎస్టీ సంస్కరణలతో పేదలు, మధ్యతరగతి ప్రజలకు ధరా భారం తగ్గింది. ఈ నెల 22 నుంచి అధికారికంగా వివిధ వస్తువులు ధరలు తగ్గనున్నాయి. మరోవైపు నాలుగు శ్లాబ్‌లుగా అమలయ్యే జీఎస్టీ పన్ను శాతాలను ఇక నుంచి రెండు శ్లాబ్‌లుగా 5, 18 శాతాలను మాత్రమే వస్తువులపై వసూలు చేయనున్నారు. దీంతో సోమవారం నుంచి మార్కెట్‌లు కళకళలాడనున్నాయి. వాస్తవానికి జీఎస్టీని కొన్నింటిపై తగ్గించడం మరికొన్నింటిని పూర్తిగా తొలగిస్తూ కేంద్ర ప్రకటించిన తర్వాత కొనుగోళ్లు తగ్గి మార్కెట్ డీలా పడింది. నేటి నుంచి వివిధ వస్తువులపై జీఎస్టీ తగ్గడం, మరికొన్నింటిపై తొలగించడంతో వ్యాపార వర్గాల్లోనూ, మరో వైపు కొనుగోలు దారుల్లోనూ ఉత్సాహం కనిపిస్తోంది. ఏసీలపై రూ. 3 వేల నుంచి రూ.5 వేలు, ఫ్రిజ్‌లపై రూ.2

నేటి నుంచి అమలులోకి నూతన సంస్కరణలు

- జీఎస్టీ శ్లాబ్‌ల తగ్గుదల .. మరో వైపు వరుసగా పండుగలు
- పుంజుకోనున్న అమ్మకాలు, కొనుగోళ్లు
- ప్రజల్లోకి జీఎస్టీపై అవగాహన కార్యక్రమాలు
- నేటి నుంచి క్షేత్రస్థాయిలో ప్రదర్శనలు

వేలు, టీవీలపై గరిష్ఠంగా రూ.5 వేలు, కార్లపై రూ.లక్ష నుంచి రూ.3 లక్షలు, బైకులపై రూ.10 వేల నుంచి రూ.30 వేల జీఎస్టీ తగ్గిన దరిమిలా మార్కెట్‌కు కళ



రానుంది. నేటి నుంచి దశమి పర్వదినం మొదలు కావడం దశమి అనంతరం దీపావళి పండుగ ఉండడంతో వ్యాపార వర్గాలు తమ తమ వ్యాపార సముదాయల్లో స్టాక్ పూర్తి స్థాయిలో ఉంచారు.

బీమా రంగంలో..

మరో వైపు బీమా రంగం వ్యాపారం ఊపందుకుంటుం దని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఎల్‌ఐసీతోపాటు ఆరోగ్య బీమా , ఇతంర బీమా పాలసీలపై జీఎస్టీని పూర్తిగా తొలగించారు. ఆయా కంపెనీలు తమ ఏజెంట్లను అప్రమత్తం చేసి పోత్సాహకాలు ప్రకటిస్తూ అధిక సంఖ్యలో పాలసీలు రాబట్టడానికి బీమా కంపెనీలు ప్రయత్నాలు చేస్తున్నాయి. 22వ తేదీ సోమవారం బీమా పాలసీలు పై భారతీయ బీమా సంస్థ ఏజెంట్లకు పలు ప్రోత్సాహకాలు ప్రకటించింది. పలు బీమా కంపెనీలు సోమవారం పని ఒత్తిడిని తట్టుకోడానికి శని,ఆదివారాలు సైతం కార్య కలాపాలు కొనసాగించాయి.

ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు..

ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జిల్లా వాణిజ్య పన్నులశాఖ అధికారులు సన్నద్ధం అవుతున్నారు. ఏసీటీవో, సీటీవోలు తమ స్థాయిలో అవగాహన కార్యక్రమాల నిర్వహణకు కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నారు. ప్రాధాన్యతల వారీగా 16 రంగాల్లో ఫ్లయర్స్ (పిక్టోరియల్)గ్రాప్‌లను ప్రధాన కూడళ్లలో ప్రదర్శించి వాటిని చూసిన వెంటనే ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో సిద్ధం చేస్తున్నారు. మరోవైపు పంచాయతీరాజ్ (మిగతా 8వ పేజీలో)



నేటి నుంచి శరన్నవరాత్రులు

జిల్లాలోని అమ్మవారి ఆలయాల వద్ద ఈనెల 22 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఆయా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రత్యేక వేదికల వద్ద అమ్మవారి విగ్రహాలు ప్రతిష్ఠించి తొమ్మిది రోజులు నవరాత్రులు ఘనంగా జరిపేందుకు ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల తొమ్మిది రోజులు అమ్మవారు ప్రతిరోజు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

కల సాకారం అయ్యేనా!



చింతలపూడి నియోజకవర్గ కేంద్రంలో ఆర్టీసీ డిపో ఏర్పాటు చేయాలన్న 50 ఏళ్ల నాటి ప్రజల కల సాకారం అయ్యేలా కదలిక ప్రారంభమైంది. ఇప్పటికి గతంలో ఎన్నోసార్లు ఈ ప్రతిపాదన వచ్చినా అడుగు ముందుకు పడలేదు. సర్వేలు జరిపినా డిపో ఏర్పాటు కాలేదు. ఎట్టకేలకు ప్రస్తుత ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ చొరవతో డిపో ఏర్పాటు దిశగా చర్యలు ఊపందుకు న్నాయి. ఈసారైనా తమ కల నెరవేరాలని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు.

- చింతలపూడిలో ఆర్టీసీ డిపో ఏర్పాటుకు అడుగులు
- 50 ఏళ్ల నుంచి స్థానిక ప్రజల ఆకాంక్ష
- గతంలో సర్వేలు..ప్రతిపాదనలతో సరి
- తెలంగాణ సరిహద్దు.. ప్రయాణికుల తాకిడి
- అరకొరగానే సర్వీసులు.. జనం పాట్లు

చింతలపూడి, సెప్టెంబరు 21 (ఆంధ్ర జ్యోతి) : చింతలపూడి 1951లోనే నియోజకవర్గ కేంద్రం గా ఏర్పడింది. ఉమ్మడి రాష్ట్రంలో మూడుసార్లు ఇక్కడ ఆర్టీసీ డిపో పెట్టేందుకు అవకాశాలు వచ్చి నా అప్పటి ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం చేశారు. 1988లో బస్‌స్టేషన్ ప్రారంభించారు. అంతకు ముందే డిపో పెట్టాలని, బస్‌స్టేషన్ నిర్మించాలని స్థానికులు కోరినా పట్టించుకోలేదు. ఆ తరువాత తెలుగుదేశం హయాంలో రెండుసార్లు అవకాశాలు వచ్చాయి. అప్పుడు పాలకులు నిర్లక్ష్యం చేశారు. 1996లో డిపో పెట్టాలని సీపీఐ ఆధ్వర్యంలో పాత బస్టాండ్‌లో 48 రోజులపాటు నిరాహార దీక్ష జరి పారు. ప్రభుత్వంలో కదలిక లేకపోవడంతో ఆ నేతలు అప్పటి పెనుగొండ ఎమ్మెల్యే సీపీఐ నేత వంకా సత్యనారాయణ ఆధ్వర్యంలో దీక్షాపరులు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి డిపో ఆవశ్యకతను వివరించారు. 2009లో ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గంగా మారింది. 2014లో రాష్ట్ర విభజనతో ఈ కేంద్రం రాష్ట్ర సరిహద్దులో నిలిచింది. 2016లో అప్పటి టీడీపీ ఎమ్మెల్యే పీతల సుజాత చింతలపూడిలో బస్సు డిపో పెట్టాలని అధికారుల చేత సర్వే జరిపించారు. అప్పుడు సఫలం కాలేదు. 2024లో ఎన్నికల సమయంలో ప్రస్తుత ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ ఎన్నికల ప్రచారంలో డిపో ఏర్పాటుపై హామీ ఇచ్చారు. ఆ హామీని నిలబెట్టుకోవడానికి గత నెలలో శ్రీకారం చుట్టి రవాణ శాఖ మంత్రి, రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చారు. ఈ నేపథ్యంలో రవాణ శాఖ, ఆర్టీసీ అధికారులు త్వరలో క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి నివేదిక ఇవ్వనున్నట్టు సమాచారం.

పలు సర్వీసులు రద్దు

తెలంగాణ సరిహద్దులోని చింతలపూడి నుంచి గతంలో ఉన్న సర్వీసులు చాలావరకు రద్దు చేశారు. సరిహద్దు ప్రాంతం కావడంతో రాష్ట్ర విభజన జరగకముందు సుమారు 250 సర్వీసులు రాకపోకలు సాగించేవి. ప్రస్తుతం 150 సర్వీసులకు దిగజారింది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పెంచాల్సి ఉండగా భిన్నంగా సర్వీసులు తగ్గించడంతో ప్రజానీకం ఇబ్బందులు పడుతున్నారు. గతంలో చింతలపూడి నుంచి గుంటూరు, నర్సరావుపేట, కాకినాడ వంటి దూరప్రాంత సర్వీసులు నడిపారు. పూచికపాడు, అంకంపాలెం, బాలువారిగూడెం వంటి గ్రామీణ ప్రాంతాలకు పాసింజర్ సర్వీసులు సైతం నడిచేవి. ప్రస్తుతం ఇవన్నీ రద్దయ్యాయి. ప్రస్తుతం ఈ నియోజకవర్గంలో జంగారెడ్డిగూడెం మండలం కలవడంతో అక్కడ ఆర్టీసీ డిపో ఉందని పర్వాలేదనుకున్నారు. కాని ఆ డిపో బస్సులు కేవలం చింతలపూడి వరకే పరిమితం. ఏలూరు మార్గంలో కామవరపుకోట వరకు వస్తుంటాయి. అంతకుమించి నియోజకవర్గంలో ఏ గ్రామానికి బస్సులు తిరగడం లేదు. ఆ డిపో వల్ల నియోజకవర్గంలో ప్రజలకు ఉపయోగం లేకుండా పోయింది.

డిపో ఏర్పాటు తప్పనిసరి..

ఇక చింతలపూడి-ఏలూరు మార్గంలో బస్సులు ఎక్కాలంటే నరకం చూడాల్సిందే. ఈ మార్గంలో పాత బస్సులు నడపుతున్నారు. ఈ నియోజకవర్గం రాష్ట్ర సరిహద్దులో ఉన్నందున మిగిలిన మూడు మండలాలు చుట్టూరా ఉన్నాయి. ఏలూరు డిపో నుంచి తెలంగాణ సరిహద్దు మేడిశెట్టివారిపాలెం వరకు 70 కిలోమీటర్ల దూరం ఉంది. ఏలూరు జిల్లాలో నూజివీడు నుంచి జంగారెడ్డిగూడెం వరకు 106 కిలోమీటర్లు ఉంది. ఈ మధ్యలో ఎక్కడా డిపోలు లేవు. వందల సంఖ్యలో గ్రామాలు ఉన్నాయి. అయితే ఇప్పటికే దూర ప్రాంత సర్వీసులు రద్దయ్యాయి. ప్రస్తుతం చింతలపూడికి ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు డిపో బస్సులు మాత్రమే వస్తున్నాయి. తాడేపల్లిగూడెం, నరసాపురం, తిరువూరు ఒకటి, రెండు సర్వీసులు నడుస్తున్నాయి. మిగిలినవి సగం తెలంగాణ సర్వీసులు నడుస్తున్నాయి. గతంలో ఇక్కడ రద్దీని చూసి మెరుపు సర్వీసులు పెట్టగా వాటిని రద్దు చేశారు. కొంతకాలం చింతలపూడి బస్‌స్టేషన్ కేంద్రంలో ఎనిమిది బస్సులు ఏర్పాటు చేసి షటిల్ సర్వీసులుగా పల్లె గ్రామాలకు నడిపారు. అవి కూడా రద్దయ్యాయి. ప్రస్తుతం చింతలపూడి మునిసిపాలిటీగా ఏర్పడింది. జనాభా పెరిగింది. జిల్లాలోనే చింతలపూడి పెద్ద నియోజకవర్గం. ఓటర్లు 2 లక్షల 75 వేల మంది ఉన్నారు. జనాభా నాలుగు లక్షలకు పైగా ఉంటారు. 70 శాతం పేద, బడుగు వర్గాలకు చెందిన (మిగతా 8వ పేజీలో)

48 రోజులు నిరాహార దీక్షలు



1996లో సీపీఐ ఆధ్వర్యంలో ప్రజా అవసరాలను గుర్తించి అప్పటి సీపీఐ నేతలు చింతలపూడిలో ఆర్టీసీ డిపో పెట్టాలని పాతబస్టాండ్‌లో 48 రోజులపాటు రిలే దీక్షలు జరిపారు. అప్పటి నాయకులు సింగంశెట్టి సుబ్బరాజు, సీపీఐ నేతల ఆధ్వర్యంలో ఈ దీక్షలు జరిగాయి. అప్పటి ప్రజాప్రతినిదులు పట్టించుకోకపోవడంతో పెనుగొండ సీపీఐ ఎమ్మెల్యే వంకా సత్యనారాయణ ద్వారా అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి డిపో ఆవశ్యకత, తమ దీక్షలు, పాలకుల నిర్లక్ష్యం గురించి ముఖ్యమంత్రికి వివరించారు.

- ఎస్.సూర్యకుమార్, సీపీఎం నేత, చింతలపూడి

పగలు ఎండ.. సాయంత్రం వాన


కైకలూరులో వర్షం

ఏలూరుసిటీ, సెప్టెంబరు 21(ఆంధ్ర జ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా జిల్లాలో అనిశ్చితి వాతావరణం నెలకొని ఉంది. పగటి సమయంలో వేసవిని తలపించేలా ఎండలు, సాయంత్రం సమయంలో ఈదురుగాలులు, పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఉత్తర అండమాన్ నుంచి మధ్య బంగాళాఖాతం, దక్షిణ కోస్తా, రాయలసీమ మీదుగా తమిళనాడు వరకు ఉపరితల ద్రోణి విస్తరించింది. ఇదే సమయంలో కోస్తాలో ఎక్కువ చోట్ల ఎండ తీవ్రత కొనసాగుతోంది. ఈ రెండింటి ప్రభావం కారణంగా ఆదివారం క్యుములోనింబస్ మేఘాలు ఏర్పడి ఎక్కడ మబ్బులుంటే అక్కడ బలమైన ఈదురుగాలులు, పిడుగులతో కూడిన వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో ఏలూరు జిల్లాలో ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. గత 24 గంటల్లో జిల్లాలో అత్యధికంగా చింతలపూడి మండలంలో 65.2 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదు కాగా జిల్లాలో సరాసరి వర్షపాతం 21 మి.మీగా నమోదైంది. మండవల్లి 62.4, భీమడోలు 62.2, లింగపాలెం 53.6, నిడమర్రు 44.2, టి.నరసాపురం 33.2, చాట్రాయి 28.6, పెదవేగి 28.6, ఏలూరు రూరల్ 26, కలిదిండి 25.6, ఆగిరిపల్లి 23.8, ముదినేపల్లి 23.8, ఏలూరు అర్బన్ 22.6, దెందులూరు 20, కైకలూరు 18.6, పెదపాడు 13.2, నూజివీడు 8.2, ముసునూరు 5.2, పోలవరం 3.8, కొయ్యలగూడెం 3.4, వేలేరుపాడు 3.2, జీలుగు మిల్లి 3.2, జంగారెడ్డిగూడెం 2, ద్వారకాతిరుమల 2, బుట్టాయిగూడెం 1.8, కామ వరపుకోట 1.2, ఉంగుటూరు 1.2, కుక్కునూరు 1.2 మి.మీ వర్షపాతాలు నమోద య్యాయి.

కైకలూరు : పగలంతా విపరీతమైన ఎండ, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు సాయం త్రానికి భారీ వర్షంతో రహదారులు నీటమునిగాయి. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షంతో కైకలూరు నియోజకవర్గ ప్రజలు సేదతీరారు.

బెల్టుషాపులపై విస్తృత దాడులు : ఎక్సైజ్ సూపరింటెండెంట్

ఏలూరు,సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా గత నెలాఖరు వరకు బెల్ట్ షాపులపై 542 కేసులు నమోదు చేసి 546 మందిని అరెస్టు చేసి 1,425 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆనాల ఆవులయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మద్యం బెల్టుషాపులకు మద్యం సరఫరా చేసే నాలుగు మద్యం దుకాణాల లైసెన్సులను సస్పెండ్ చేసి రూ.9.50 లక్షలు అపరాధ రుసుం వసూలు చేశామన్నారు. నాటుసారా కట్టడిలో భాగంగా 847 కేసులు నమోదు చేసి 907 మందిని అరెస్టు చేసి 5వేల907 లీటర్లు సారా స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. జిల్లాలో 155 మద్యం షాపుల్లో ఎంఆర్‌పీ ధరలకు అమ్మేటట్టు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామన్నారు. ఏ విధమైన ఉల్లంఘనలు జరిగినా 14405 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయ వచ్చన్నారు. అలాంటి షాపులపై కేసులను నమోదు చేసి చర్యలను తీసుకుంటామన్నారు.

నేడు యథావిధిగా పీజీఆర్ఎస్

ఏలూరు,సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ ఎస్) సేవలను ఏలూరు కలెక్టరేట్, డివిజనల్, మండల, మున్సిపల్ కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10 గంటలకు యథావిధిగా నిర్వహిస్తామని కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. ఇంటి నుంచి ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేసేందుకు ప్రభుత్వం అందించిన అధి కారిక వెబ్‌సైట్ హెచ్‌టీటీపీఎస్://మీ కోసం.ఏపీ.జీవో.ఇన్‌లో ఫిర్యాదు చేయవచ్చన్నారు.

రుచి..శుచిగా!



తృప్తి క్యాంటీన్ (ఫైల్)

- ఏలూరు జిల్లాలో 'తృప్తి' క్యాంటీన్ల ఏర్పాటుకు కసరత్తు
- మహిళా ఆర్థికాభ్యున్నతే ధ్యేయం
- ఒక కుటుంబం.. ఒక పారిశ్రామికవేత్త దిశగా అడుగులు

ప్రతి కుటుంబం నుంచి మహిళలు పారిశ్రా మికవేత్తగా ఎదగాలన్నది సీఎం చంద్రబాబు నినాదం.. దీనికి అంకురార్పణగా స్వయం సహాయక సంఘాల ద్వారా రుచి..శుచి.. అభిరుచికి ఆలంభనంగా తృప్తి క్యాంటీన్లు రానున్నాయి. మెప్మా ఆధ్వర్యంలో సారా (ఎస్ఏఆర్ఏ) అనే సంస్థ సీఎస్ఆర్ ఫండ్స్‌తో ఈ క్యాంటీన్లను పట్టణాలు, నగరాల్లో ప్రారంభించడానికి తుది కసరత్తులు చేస్తోంది. అన్ని సవ్యంగా సాగితే మూడు నెలల్లోపే తృప్తి క్యాంటీన్ ఏలూరులో ప్రారంభించడానికి అవకాశాలున్నాయి.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి) : మహిళా స్వయం సహాయక సం ఘాల (ఎస్‌హెచ్‌జీ)కు ఆర్థిక సాధికారిత ధ్యేయంగా 'తృప్తి' కంటైనర్ ఆధారిత హోటల్స్ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నెల్లూరు, విజయవాడ నగరాల్లో ప్రారంభించింది. అదే స్ఫూర్తితో ఏలూరు నగరంతో పాటు నూజివీడు, జంగారెడ్డిగూడెం, చింతలపూడిల్లో నిత్యం రద్దీగా కూడలి ప్రాంతాలు, హైవేలు, పర్యాటక ప్రాంతాల్లో కనీసం నలుగురు డ్వాక్రా సభ్యులతో కలిసి ఈ యూనిట్ స్థాపించాలని నిర్ణయించారు. మిషన్ ఎలిమేషన్ ఆఫ్ పావర్టీ (మెప్మా) ఆధ్వర్యంలో సారా అనే ప్రైవేట్ సంస్థ పార్టనర్‌షిప్ (సీఎస్ఆర్) ఫండ్స్‌తో అధునాతన కుకింగ్ యంత్రాలు, పరికరాలతో మహిళలే తయారు చేయనున్నారు. ప్రైవేట్ హోటల్స్ ఇటీవల ఇడ్లీస్, ఇతర బ్రాండెడ్ కంపెనీలు మాదిరిగానే శుచి, రుచిగా ఉండేలా ఆహార పదార్థాలకు రూప కల్పన చేయనున్నారు. 20x12 పరిమాణం కలిగిన కంటైనర్‌లో దోశ, ఇడ్లీ, నాన్‌వెజ్ టిఫిన్లు తయారు చేయనున్నారు. దీనికి ఇప్పటికే డ్వాక్రా సంఘాల్లోనే వంటలు వండడంలో గుర్తింపు వచ్చిన మహిళలను ఎంపిక చేసి, వారితో ఈ క్యాంటీన్లు స్థాపించాలనే యోచనలో ఉన్నారు. 75 శాతం రుణంగా మెప్మా అధికారులు ఇప్పిస్తారు. రూ.రెండు లక్షలు ఆయా మహిళలు భరించాలి. మరో 25 శాతం వివిధ యంత్రాలను డిజైన్ చేసిన సారా కంపెనీ అందివ్వనుంది. అన్ని ఖర్చులు పోను నలుగురు సభ్యులకు నెలకు రూ.లక్ష ఆదాయం సమకూరేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

స్థలాల ఎంపికపై దృష్టి

ఈ దిశగా మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ పి.మాధవి ఇప్పటికే జిల్లా యంత్రాంగానికి ప్రాజెక్టు రూపకల్పనపై వివరించారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టులో కలెక్టర్, మున్సిపల్ కమిషనర్లను ప్రభుత్వం భాగస్వామ్యం చేసింది. స్థలాలు ఎంపిక చేయడంపై ఇప్పుడు దృష్టి పెట్టారు. స్థలాలు లీజుకు తీసుకోవడమా? లేదా ప్రభుత్వం సమకూర్చుతుందా.. అనే దానిపై పలు ప్రాంతాలను పరిశీలిస్తున్నారు.

మహిళలకు మంచి అవకాశం : మహాలక్ష్మి, జిల్లా కో ఆర్డినేటర్



ఆర్థిక స్వాలంబన సాధించడానికి మహిళలకు ఇదొక మంచి అవకాశం. ఇప్పటికే పలు ప్రాంతాల్లో మహిళలు వంటలు, ఇతర మెస్‌ల ద్వారా ఆదాయం సముపార్జిస్తున్నారు. హోటల్ రంగంలోకి కూడా మహి ళలు రావాలని సీఎం చంద్రబాబు యోచించారు. వన్ ఫ్యామిలీ.. వన్ ఎంటర్‌ప్రెన్యూర్ నినాదం సాకారం అవుతుందని మేము భావిస్తున్నాం.

శ్రీవారి ఆలయ భక్తుల రద్దీపై అమావాస్య ఎఫెక్ట్


ఆలయ పరిసరాల్లో సాధారణ రద్దీ

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీపై మహాలాయ అమావాస్య ఆదివారం తన ప్రభావాన్ని చూపింది. చినవెంకన్న ఆలయా నికి ప్రతీ శని, ఆదివారాల్లో వేలాది సంఖ్యలో భక్తులు తరలి వస్తారు. సెలవు రోజులు కావడంతో దాదాపు ఇరవై వేలమంది వరకు భక్తులు ఆలయానికి వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటారు. అయితే అమావాస్య వచ్చిన కారణంగా ఈ ఆదివారం తక్కువ సంఖ్యలో భక్తులు క్షేత్రానికి విచ్చేశారు. ఈ క్రమంలో ఆలయంలోని అన్ని విభాగాల్లోను సాధారణ భక్తుల రద్దీ కూడా కానరాలేదు. ఆలయానికి వచ్చిన భక్తులు క్యూలైన్లలో వెళ్లి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.

మంత్రిని విమర్శించ లేదు

నూజివీడు బార్ అసోసియేషన్

నూజివీడు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలిపేందుకు న్యాయ వాదులు చేస్తున్న పోరాటంపై కొందరు వక్రభాష్యం చెప్ప డం తగదని నూజివీడు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్య దర్శులు మన్నెం రమేష్, వై.హరిబాబు, మాజీ అధ్యక్షుడు ఇందుపల్లి సత్య ప్రకాష్ అన్నారు. గత ఎన్నికల సమ యంలో స్థానిక ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నూజి వీడును ఎన్టీఆర్ జిల్లాలో కలుపుతామని వాగ్దానం చేశారని దానిని నిలబెట్టుకోమని కోరామే తప్ప మంత్రి కొలుసు పార్థసారథి, సీఎంపై విమర్శలు చేయలేదన్నారు. ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తామని చెబితే నిరసనలను ఆపేవారమ న్నారు. ఎన్టీఆర్ జిల్లాలో కలవడంపై అడ్డంకులు ఉన్నాయని మంత్రి భావిస్తే ఆకాంక్షలు నెరవేర్చేం దుకు ఆయన వెనుక నడవడానికి తాము సిద్ధమన్నారు. స్థానిక ప్రజల ఆకాంక్షలను సీఎం దృష్టికి తీసుకువెళ్ళాలని ప్రయత్నిం చామని, కూటమి ప్రభుత్వం కోసం పోరాడిన అనేకమంది న్యాయ వాదులు సైతం ఉన్నారన్నారు. తమపై అనుచిత వ్యాఖ్యలను వారి విజ్ఞతకే వదిలివేస్తున్నామన్నారు. సీనియర్ న్యాయవాదులు వై.ఎస్. దొరై, మధు రవిశంకర్, పలగాని రాంబాబు, గోళ్ళ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉధృతం అవుతున్న.. విద్యుత్ ఉద్యోగుల సమ్మె

- నేడు భీమవరం ఎస్ఈ ఆఫీస్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ
- ఉమ్మడి పశ్చిమ గోదావరి జేఏసీ నాయకులు హాజరు

తాడేపల్లిగూడెం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ ఉద్యో గులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె ఉధృతం అయ్యే దిశగా అడుగులు పడుతున్నాయి. విద్యుత్ జేఏసీ రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 16వ తేదీ నుంచి ప్రారంభమైంది. ఈనెల 22న చలో భీమవరం కార్య క్రమం చేపట్టారు. ఉదయం 9 గంటలకు భీమవరం చేరే విధంగా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఉన్న జేఏసీ నాయకులు సన్నద్ధమయ్యారు. వీరంతా భీమవరం చేరి ఎస్ఈ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వనున్నారు.

డిమాండ్లు ఇవే..

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలి. 2020 పీఆర్‌సీ ఎరియర్స్ ఇవ్వాలి. 2018 నుంచి 2022, 2024 జాతీయ పండుగలు సెలవు దినాలకు పెయిడ్ హాలిడేస్ ఇవ్వాలని, కొత్త షిప్ట్ ఆపరేటర్లకు జీతాల వ్యత్యాసాలు లేకుండా అందరికి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, బేసిక్‌పే రూ.46 వేలుగా నిర్ధారించాలని, అన్ లిమిటెడ్ హెల్త్‌కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. గత ప్రభుత్వం పాలనలో కూడా వీరిని పట్టించుకున్న దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత తమ సమస్యలు పరిష్కరిస్తుందని వీరంతా ఎదురు చూశారు. పట్టించుకోకపోవడంతో ఆందోళన బాట పట్టారు.

ఎంఈవో నియామకాల్లో హెచ్‌ఎంలకు అన్యాయం

లోపలి పేజీలో..



ఇంద్రకీలాద్రికి దసరా శోభ

నేటి నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు

- ఈఏడాది 20 లక్షలమంది భక్తులు వస్తారని అంచనా
- 29న దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం చంద్రబాబు

విజయవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. సోమవారం తెల్లవారుజాము నుంచి అమ్మవారికి స్నపనాది క్రతువు నిర్వహిస్తారు. తొలిరోజు అమ్మవారు శ్రీబాలాత్రిపుర సుందరి అలంకారంలో దర్శనమిస్తారు. ఉదయం 8-8.30 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. ఈ ఏడాది దేశం నలుమూలల నుంచి ఉత్సవాలకు 20 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేశారు. ప్రొటోకాల్ జాబితాలో ఉన్న వీఐపీల కోసం స్లాట్ విధానాన్ని తీసుకొచ్చారు. ఉదయం 7-9, మధ్యాహ్నం 3-5 గంటల వరకు కల్పిస్తారు. ఈ ఏడాది భక్తుల కోసం 20 లక్షల లడ్డూలను సిద్ధం చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల కారణంగా ఇంద్రకీలాద్రి విద్యుత్ వెలుగుల్లో దేదీప్యమానంగా వెలుగుతోంది. 29వ తేదీ మూలానక్షత్రం రోజున అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిస్తారు. ఆరోజు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

విజయవాడలో ట్రాఫిక్ మళ్లింపులు

శరన్నవరాత్రులు ముగిసే వరకు అమలు

విజయవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై సోమవారం నుంచి ప్రారంభమయ్యే దసరా శరన్నవరాత్రి మహోత్సవాల కారణంగా పోలీసులు ట్రాఫిక్ మళ్లింపులు విధించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి విజయవాడ మీదుగా రాకపోకలు సాగించే భారీ వాహనాలను దారి మళ్లిస్తున్నట్టు పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు తెలిపారు.

- హైదరాబాద్-విజయవాడ-హైదరాబాద్-విశాఖపట్నం మార్గంలో రాకపోకలు సాగించే భారీ వాహనాలు నల్లకుంట వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి చిన్నఅవుటపల్లి వద్ద దిగి హనుమాన్ జంక్షన్ మీదుగా వెళ్లాలి. విశాఖ నుంచి వాహనాలు చిన్నఅవుటపల్లి వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి నల్లకుంట వద్ద దిగి హైదరాబాద్ మార్గంలోకి వెళ్లాలి.
- హైదరాబాద్ - మచిలీపట్నం-హైదరాబాద్ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు నల్లకుంట వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి చిన్నఅవుటపల్లి వద్ద దిగాలి. కేసరపల్లి మీదుగా మచిలీపట్నం చేరుకోవాలి. ఇటు నుంచి వెళ్లే వాహనాలు కేసరపల్లి వద్ద నుంచి చిన్నఅవుటపల్లి వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కాలి.
- హైదరాబాద్-చెన్నై-హైదరాబాద్ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు నార్కట్‌పల్లి, నల్లగొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, అద్దంకి, మేదరమెట్ల మీదుగా గుంటూరు చేరుకుని అక్కడి నుంచి చెన్నై వెళ్లాలి. చెన్నై నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు కూడా ఇదే మార్గంలో ప్రయాణించాలి.
- చెన్నై-విశాఖపట్నం-చెన్నై మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు ఒంగోలు, త్రోవగుంట, చీరాల, బాపట్ల, రేపల్లె, అవనిగడ్డ, పామర్రు, గుడివాడ, హనుమాన్ జంక్షన్ బైపాస్ మీదుగా వెళ్లాలి. విశాఖ నుంచి చెన్నై వెళ్లే వాహనాలు కూడా ఇదే మార్గంలో ప్రయాణించాలి.

నేటి నుంచి శ్రీశైలంలో దసరా మహోత్సవాలు



శ్రీశైలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా శ్రీశైల క్షేత్రంలో సోమవారం నుంచి దసరా మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. అక్టోబరు 2వ తేదీ వరకు ఈ వేడుకలు నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు అమ్మవారి ఆలయ మండపంలో యాగశాల ప్రవేశం చేసి గణపతిపూజ, స్వస్తిపుణ్యాహవచనం, దీక్షా సంకల్పం, కంకణపూజ, కంకణధారణ తదితర పూజలు నిర్వహించనున్నారు. భ్రమరాంబికాదేవి అమ్మవారు సోమవారం శైలపుత్రి అలంకారంలో దర్శనమివ్వనున్నారు. స్వామి, అమ్మవార్లకు భృంగి వాహన సేవ నిర్వహించనున్నారు.

ఉత్తరాంధ్రకు వాయు'గండం'

- పిడుగులతో భారీ వర్షాలు పడతాయని హెచ్చరిక
- బెజవాడలో 13 సెంటీమీటర్ల వర్షం.. నేడు ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు

విశాఖపట్నం/అమరావతి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రకు వాయుగుండం పొంచి ఉంది. ఈ నెల 26న వాయవ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడనున్న వాయుగుండం 27న ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా మధ్య తీరం దాటనుంది. దీని ప్రభావం ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా ప్రాంతాలకు ఎక్కువగా ఉంటుందని, కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. సోమవారం ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. దీంతో సోమ, మంగళవారాల్లో ఉత్తరాంధ్రలో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నెల 25న తూర్పుమధ్య, ఈశాన్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుంది. మూడు రోజుల వ్యవధిలో ఏర్పడనున్న రెండు అల్పపీడనాల ప్రభావంతో ఈనెల 24 నుంచి 27 వరకు కోస్తా, రాయలసీమలో అనేకచోట్ల వర్షాలు, అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. మరోవైపు, కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల పిడుగులు, ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిశాయి. విజయవాడ సింగ్‌నగర్‌లో 13, చిత్తూరు జిల్లాలోని కాగితలో 8.3, ఏలూరు జిల్లా కాకర్లమూడిలో 8, ప్రకాశం జిల్లా సింగరాయకొండలో 6.9, చిత్తూరులోని యాదమర్రిలో 6.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. సోమవారం రాష్ట్రంలో పలుచోట్ల ఉరుములు, పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు, ఒకట్రెండుచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని నిపుణులొకరు తెలిపారు.

అప్పన్న సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



కప్పస్తంభం వద్ద జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్

సింహాచలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సింహాచలంలోని వరాహలక్ష్మీనృసింహస్వామిని ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు అధికార లాంఛనాలతో ఆహ్వానం పలికారు. న్యాయమూర్తి కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని, బేడామండప ప్రదక్షిణ చేసిన అనంతరం అంతరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు తరువాత పండితులు ఆశీర్వచనాలీయగా, ఈఓ శాలువతో సత్కరించి స్వామివారి ఫొటోను జ్ఞాపికగా అందజేశారు.

నేటి నుంచి విశాఖలో 28వ జాతీయ ఈ గవర్నెన్స్ కాన్ఫరెన్స్

- ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ అమలుతీరు బాగుంది
- కేంద్ర పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల శాఖ కార్యదర్శి

విశాఖపట్నం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): విశాఖ వేదికగా 28వ జాతీయ ఈ-గవర్నెన్స్ కాన్ఫరెన్స్‌ను ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించనున్నట్టు కేంద్ర పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల శాఖ కార్యదర్శి వి.శ్రీనివాస్ వెల్లడించారు. విశాఖలో ఆదివారం మాట్లాడుతూ.. వికసిత్ భారత్, సివిల్ సర్వీసెస్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ థీమ్‌తో సదస్సు ను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ కాన్ఫరెన్స్‌ను ప్రారంభిస్తారన్నారు. ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ అమలుతీరు బాగుందని, ప్రస్తుతం 738 రకాలు సేవలు అందిస్తున్నారని, దీనిని దేశంలోనే అత్యుత్తమ మోడల్‌గా అభివర్ణించారు. విశాఖ డిక్లరేషన్‌లో దీనిని భాగం చేసి దేశమంతా అమలు చేసేందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి 200 మందికిపైగా ప్రతినిధులు సదస్సులో పాల్గొంటారన్నారు. అత్యుత్తమ కార్యక్రమాలు నిర్వహించిన వారికి ఈ గవర్నెన్స్- 2025 అవార్డులు అందిస్తామన్నారు.

కూటమి నేతలపై అనుచిత పోస్టులు

- వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త అరెస్టు



వైసీపీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌తో అంజాద్ ఖాన్ (ఫైల్)

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌పై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తను శ్రీసత్యసాయి జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు ఎస్పీ సతీష్‌కుమార్ ఆదివారం వెల్లడించారు. కదిరి పట్టణానికి చెంది న కౌలేపల్లి అంజాద్‌ఖాన్ అలియాస్ మెగా అంజాద్ వైసీపీ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తుండేవాడు. రెండ్రోజుల క్రితం సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌పై అనుచిత పోస్టులు పెట్టడంతో అరెస్టు చేసినట్లు తెలిపారు.

తిరుమలేశుడి బ్రహ్మోత్సవాలకు రేపు అంకురార్పణ

- ఎల్లుండి ధ్వజారోహణంతో ఉత్సవాలు ఆరంభం

తిరుమల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శ్రీవేంకటేశ్వరుని సాలకట్ల బ్రహ్మోత్సవాలను ప్రారంభించడానికి మంగళవారం అంకురార్పణ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా సాయంత్రం ఆలయంలో సేనాధిపతిని అలంకరించి విశేష సమర్పణ గావిస్తారు. అనంతరం తిరుచ్చిపై ఆశీనులు చేస్తారు. రాత్రి ఏడు గంటలకు ఆలయం నుంచి బయల్దేరి నాలుగు మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తారు. తర్వాత ఆలయానికి చేరుకున్న అనంతరం రంగనాయకమండపంలో ఆస్థానం జరుగుతుంది. యాగశాలలో అర్చకస్వాములు ఆగమోక్తంగా కైంకర్యాలు నిర్వహించి అంకురార్పణ(బీజవాపం) కార్యక్రమం నిర్వహిస్తారు. 24వ తేదీన ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభవుతాయి.

తప్పుడు వార్తలను నమ్మకండి

- కపిలతీర్థంలో ఎలాంటి తొక్కిసలాట జరగలేదు: టీటీడీ

తిరుమల, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): తిరుమలలో తొక్కిసలాట జరిగిందని, కపిలతీర్థంలో ఏర్పాట్లు చేయలేదని సోషల్ మీడియాలో చేస్తున్న తప్పుడు వార్తలను భక్తులు నమ్మవద్దంటూ టీటీడీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. 'మహాలయ అమావాస్య సందర్భంగా తిరుపతి కపిలతీర్థం ఆలయం బయట ప్రైవేట్ వ్యక్తులు పితృతర్పణాల కార్యక్రమం చేసుకోవడం ఆనవాయితీ. ఈక్రమంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్‌ను టీటీడీ ఏర్పాట్లు చేసింది. రద్దీ నేపథ్యంలో భద్రతాపరంగా పటిష్ఠ చర్యలు తీసుకున్నాం. ఎస్పీ వాహనం, పోలీస్ వాహనం రావడంతో తొక్కిసలాట జరిగినట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. తిరుమలకు ఏమాత్రం సంబంధం లేకపోయినా ఇక్కడ తొక్కిసలాట అని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కొంతమంది టీటీడీని లక్ష్యం చేసుకుని దుష్ప్రచారం చేయడం సరికాదు. టీటీడీ ప్రతిష్ఠను పలుచన చేయడాలని చూడటం వారి దిగజారుడుతనానికి నిదర్శనం. ఇలాంటి వార్తలను నమ్మవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం. టీటీడీపై దుష్ప్రచారం చేస్తున్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం' అంటూ టీటీడీ తన సోషల్ మీడియా ద్వారా పేర్కొంది.

విజ్ఞాన్ వర్సిటీలో 62వ జాతీయ చెస్ చాంపియన్ షిప్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య తదితరులు

గుంటూరు విద్య, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో 62వ నేషనల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ద్రోణాచార్య అవార్డు గ్రహీత కోనేరు అశోక్ మాట్లాడుతూ ఆలిండియా చెస్ ఫెడరేషన్ విభాగంలోని ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ సహకారంతో పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. విశ్వనాథన్ ఆనంద్, హరికృష్ణ, హంపి, హరిదాసన్, ప్రగ్యానంద లాంటి ప్రతిభావంతులు దేశానికి ఎనలేని కీర్తి తెచ్చారని అశోక్ కొనియాడారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మొదటగా ఒక ఎత్తు వేసి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలిండియా చెస్ ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీ లాల్‌త మునా, చీఫ్ ఆర్బిటర్ అనంత రామన్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఏ.సురేష్, చీఫ్ అడ్వయిజర్ కేవీవీ శర్మ, సెక్రటరీ కే.జగదీష్, గుంటూరు చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సీహెచ్ రవీంద్ర రాజు, దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన ఆటగాళ్లు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

27లోపు డిమాండ్లు పరిష్కరించాలి

- లేదంటే పెన్షన్ పంపిణీని నిలిపేస్తాం
- ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ

పెనమలూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఈనెల 27 లోపు తమ డిమాండ్లను నెరవేర్చేందుకు ప్రభుత్వం చర్చలకు పిలవని పక్షంలో అక్టోబరు 1 నుంచి పెన్షన్ పంపిణీని నిలుపుదల చేసేందుకు వెనుకాడబోమని ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ హెచ్చరించింది. పోరంకిలో ఆదివారం జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బగ్గా జగదీష్ మీడియాతో మాట్లాడారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో కలెక్టర్లకు, ఇతర అధికారులకు జేఏసీ తరఫున నోటీసులు అందజేస్తామన్నా రు. 26, 27 తేదీల్లో ప్రభుత్వ అధికారులు నిర్వహిస్తున్న అఫిషియల్ వాట్సాప్ గ్రూపుల నుంచి ఉద్యోగులందరూ స్వచ్ఛందంగా వైదొలుగుతారన్నారు. 28న రాయలసీమ వేదికగా కర్నూలు జిల్లాలో ప్రాంతీయ సమావేశం ఏర్పాటుచేసి తదుపరి కార్యాచరణను విడుదల చేస్తామని తెలిపారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి : రాజేంద్ర

ఏలూరుటూటౌన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ రక్త దానం చేయడం అలవరుచుకోవాలని డాక్టర్ రాజేంద్ర అన్నారు. ఆదిత్య డిగ్రీ కాలేజీలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గుడ్ సమ్మరిటన్ క్యాన్సర్ ఆసుపత్రి సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజేంద్ర మాట్లాడుతతూ ఒక యూనిట్ రక్తంతో ముగ్గురు ప్రాణాలు రక్షించవచ్చన్నారు. ప్రతీ యువకుడు సంవత్సరానికి ఒక్కసారి అయిన విధిగా రక్తదానం చేయాలన్నారు. ప్రిన్సిపాల్ చంద్రరావు మాట్లాడుతూ సమాజ సేవలో భాగంగా తమ కళాశాల విద్యార్థులు రక్తదానం చేయడంలో ముందుంటారని అన్నారు. కళాశాలలో 250యూనిట్ల రక్తం సేకరించారు. ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్.దుర్గాప్రసాద్, అనీల్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.


అవినీతి రహిత సమాజాన్ని నిర్మించాలంటూ వాక్‌థాన్

ఏలూరుటూటౌన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): అవినీతి రహిత సమాజాన్ని నిర్మించడానికి కృషి చేస్తామని ఏపీ గ్రామీణ బ్యాంక్ ఆర్.ఆర్.పేట బ్రాంచ్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ హరీశ్ బేతా అన్నారు. బ్యాంకు ఆధ్వర్యంలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా వాక్‌థాన్ నిర్వహించారు. అనంతరం బ్యాంకు ఉద్యోగులు రక్తదానం చేశారు. రిజనల్ మేనేజర్ యూ.శ్రీదేవి, బ్రాంచ్ మేనేజర్ ఎం.హైందవి పాల్గొన్నారు.

ఫొటో, వీడియోగ్రాఫర్స్ సంక్షేమానికి కృషి చేస్తా : పెదబాబు

ఏలూరుటూటౌన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ది ఏలూరు అవుట్‌డోర్ ఫొటో గ్రాఫర్స్ అండ్ వీడియోగ్రాఫర్స్ గౌరవాధ్యక్షుడిగా నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబును ఎన్నుకున్నారు. పవర్‌పేట ఐఎంఏ హాల్లో ఫొటో గ్రాఫర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. అధ్యక్షులు వై.రంగారావు, సెక్రటరీగా వెంకట్, ట్రెజరరీగా అప్పారావు ఎన్నికయ్యారు. అనంతరం పెదబాబు మాట్లాడుతూ మారుతున్న కాలానికి, టెక్నాలజీకి అనుగుణంగా ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అప్‌డేట్ అవ్వాలన్నారు. ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఎన్ఆర్‌పేట ఫొటోట్రేడ్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ది ఫొటోట్రేడ్ వెల్ఫేర్ అసోసి యేషన్ కోశాధికారిగా ఉజ్వల్ కుమార్ ఎన్నికయ్యారు. గౌరవ సలహాదారులు బాలాజీ, మాజీ అధ్యక్షులు మేగా దుర్గారావు, అమీర్ బాషా, అధ్యక్షులు మద్దాల శేఖర్, ప్రధాన కార్యదర్శి ఎస్ఎన్‌డీ ప్రసాద్ పాల్గొన్నారు.

ఎక్స్‌లెన్సీ అవార్డు గ్రహీత దాకారపు కృష్ణకు ఘన సన్మానం



జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): పరస్పర సహకారంతో కె9 కాపు సంక్షేమ సంఘాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ఆదర్శంగా నిలవాలని జడ్పీటీసీ పోల్నాటి బాబ్జీ సూచించారు. ఇటీవల రాష్ట్ర మంత్రులు కొల్లు రవీంద్ర, కొండపల్లి శ్రీనివాస్ చేతుల మీదుగా రాజ్‌న్యూస్ బిజినెస్ ఎక్స్‌లెన్సీ బిజినెస్ అవార్డు అందుకున్న దాకారపు కృష్ణకు ఆదివారం కె9 కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. జడ్పీటీసీ పోల్నాటి బాబ్జీ మాట్లాడుతూ కరోనా సమయంలో రోటరీ క్లబ్ ద్వారా, వ్యక్తిగతంగా తాను ఎంతో మందిని ఆదుకుని అండగా నిలిచారన్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత దాకారపు కృష్ణను కె9 కాపు సంక్షేమ సంఘం తరఫున ఘనంగా సత్కరించారు. తొమ్మిదేళ్ల శ్రీనివాస్, శీలం కృష్ణంరాజు, ఎలికే తాతారావు, బుద్దాల సత్యనారాయణ, ఎలికే వరప్రసాద్, యు.ఏసుబాబు, కెఎస్.శంకరరావు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి : ఎమ్మెల్యే రోషన్


లింగపాలెం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలని, ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల సిబ్బంది మర్యాదగా వ్యవహరించాలని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. మండలంలోని ధర్మాజీగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆదివారం రాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. చికిత్స తీసుకుంటున్న రోగులతో మాట్లాడారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆసుపత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, ప్రజలకు ప్రభుత్వ వైద్యంపై నమ్మకం కలిగేలా డాక్టర్లు, సిబ్బంది వ్యవహరించాలని సూచించారు. రోగుల ఫీడ్‌బ్యాక్‌ను పరిశీలనలోకి తీసుకుంటామన్నారు. సీజనల్ వ్యాధులపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వాటి నిర్వహణకు అవసరమైన మందులు, పరికరాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.

శ్రీవారి కల్యాణానికి రావాలని ఎంపీ, ఎమ్మెల్యేలకు ఆహ్వానం



ద్వారకాతిరుమల, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఆశ్వయుజ మాస దివ్య బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆహ్వాన పత్రికను రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరికి, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజుకు ఆలయ ఈవో ఎన్వీ సత్యనారాయణమూర్తి ఆదివారం అందజేశారు. ముందుగా రాజమహేంద్రవరం ఎంపీ కార్యాలయానికి వెళ్లి ఆమెకు అందజేశారు. ఆ తరువాత ఎమ్మెల్యే మద్దిపాటికి అందజేశారు. ఇరువురిని కల్యాణానికి రావాలని కోరారు.

జీవన ఎరువులతో యూరియాకు చెక్!



జీవన ఎరువుల డబ్బా



యూరియా దొరకదేమోనని రైతులను వెంటాడుతున్న భయం....
యూరియా కృత్రిమ కొరత కొరతను అరికట్టేందుకు అధికారుల పరుగులు...
యూరియా కొరత లేదంటున్న అధికారులు....
కొరత ఉందంటూ వైసీపీ నిరసనలు....
అసలు యూరియాకు అంత డిమాండ్ ఏమిటి అన్న చర్చ ప్రస్తుతం అందరిలోనూ నడుస్తోంది.
యూరియాకు ప్రత్యామ్నాయం ఏమీ లేదా అంటే జీవన ఎరువులు ఉన్నాయని ప్రకృతి వ్యవసాయ నిపుణుడు అడ్డాల గోపాలకృష్ణ చెప్తున్నారు. ప్రకృతి వ్యవసాయంతో ఎరువుల వినియోగం తగ్గించడమే కాకుండా భూసారాన్ని ఎంతగానో పెంపొందించవచ్చని ప్రకృతి వ్యవసాయాధికారి శ్రీనివాస్ చెప్తున్నారు.

(అమలాపురం రూరల్-ఆంధ్రజ్యోతి)

యూరియా కొరత విషయంలో ధర కూడా ప్రభావం చూపిస్తుంది. యూరియా బస్తా ధర కేవలం రూ.267 మాత్రమే. కానీ యూరియా బస్తా ఒక్కింటికి కేంద్ర ప్రభుత్వం ఎంత రాయితీ ఇస్తుందో రైతు సంఘాల నాయకులు అందరికీ కూడా తెలియదు. యూరియా బస్తా ధర వాస్తవానికి రూ.1457.29. కాగా కేంద్రం ప్రభుత్వం 50 కిలోల యూరియా బస్తాకు రూ.1190.79 రాయితీ ఇస్తోంది. దాంతో రైతులకు ఒక్కో బస్తా రూ.267కే అందిస్తున్నారు. యూరియాకు రాయితీ ఉండడం, కాంప్లెక్సు ఎరువులకు లేకపోవడం కూడా ఇందుకు కారణం. యూరియా కలిసి ఉన్న కాంప్లెక్సు ఎరువుల బస్తా రూ.1,350 నుంచి పైమాటే. పంట పరిపూర్ణంగా ఎదిగేందుకు కాంప్లెక్సు ఎరువులు ఎంతో దోహదపడతాయని జిల్లా అధికారులు ప్రచారం చేసినా రైతులు మాత్రం యూరియాపైనే దృష్టి సారిస్తున్నారు. ఇక నానో ఎరువుల తయారీలో భాగంగా యూరియాను తక్కువ ధరకే సిద్ధం చేసిన తయారీదారులు తగినంత ప్రచారం లేకపోవడం, ఒక్కసారిగా రైతులు కొత్త విధానాన్ని అనుసరించకపోవడంకూడా ఇందుకు కారణం. ఇలా ఎన్నో కారణాలు ఉన్నాయి.

యూరియాకు ప్రత్యామ్నాయంగా జీవన ఎరువులు

యూరియాలో 90 శాతానికి పైగా నత్రజని ఉంటుంది.దానికి ప్రత్యామ్నాయంగా తక్కువ ఖర్చుతో లభించే జీవన ఎరువులు వినియోగించవచ్చని ప్రకృతి వ్యవసాయ నిపుణులు, అధికారులు చెప్తున్నారు. యూరియాకు ప్రత్యామ్నాయంగా జీవన ఎరువులు అయిన రైజోబియం, అజతోబాక్టర్, అజస్పైరిల్లం, నీటి ఆకుపచ్చనాచు వినియోగించడం ద్వారా భూమి సహజ స్వభావం దెబ్బతినకుండా నత్రజని శాతాన్ని పెంచవచ్చు.



నానో ఎరువుల డబ్బాలు

తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులు...

జీవన ఎరువులను వినియోగించడం ద్వారా నాణ్యమైన, ఆరోగ్యవంతమైన పంట దిగుబడులు సాధించవచ్చు. భూసారం మెరుగుపడుతుంది. జీవన ఎరువులు నత్రజనిని స్థిరీకరిస్తాయి. నేల ద్వారా సంక్రమించే తెగుళ్ల బెడద తగ్గి 10 నుంచి 20 శాతం దిగుబడి పెరుగుతుంది. పంట ఉత్పత్తుల్లో ఎక్కడా క్రిమిసంహారక మందుల అవశేషాలు ఉండవు. జీవన ఎరువులను ఒకసారి వినియోగిస్తే తదుపరి వాటంతట అవే వృద్ధి చెందుతాయి. తక్కువ ఖర్చుతో నాణ్యమైన అధిక దిగుబడులకు దోహదపడుతుంది.

రైజోబియం...


ఇది పైర్ల వేర్లపై బుడిపెలు కలుగజేసి సహజీవనం చేస్తూ గాలిలోని నత్రజనిని మొక్కలకు అందిస్తుంది. ఎకరాకు 40 కిలోల నత్రజని సహజసిద్ధంగా పైరుకు లభ్యం అవుతుంది. అదే విధంగా అజోస్పైరిల్లం, ఆకుపచ్చ నాచును వాడడం వల్ల పైరుకు, చేలకు దీర్ఘకాలిక ప్రయోజనాలు ఉంటాయి. రసాయన ఎరువుల వినియోగాన్ని గణనీయంగా తగ్గించవచ్చు.



యూరియా బస్తా

జీవన ఎరువులతో ప్రశాంతంగా సాగు

అడ్డాల గోపాలకృష్ణ, అమలాపురం



యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్న సంఘటనలు చూస్తున్నాం. కానీ జీవన ఎరువులు వినియోగించే రైతులు ఎటువంటి ఇబ్బందీ లేకుండా ప్రశాంతంగా సాగు చేసుకుంటున్నారు. ప్రకృతి వ్యవసాయ విధానాలను మరింత ప్రోత్సహించడంతో పాటు ప్రత్యేక రాయితీలు కూడా కల్పించాలి. ద్రవ జీవామృతం, ఘన జీవామృతం, మీనామృతం వంటివి మొక్కలకు నత్రజనిని అందించడంలో కీలకంగా పనిచేస్తాయి.

ఎంఈవో నియామకాల్లో
హెచ్‌ఎంలకు అన్యాయం
మండల విద్యాధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎంఈవో-1, 2 పోస్టులన్నీ జడ్పీ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులవేనని ఎంఈవో-2ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టీవీ.రామకృష్ణ అన్నారు. మండల విద్యాశాఖాధికారుల నియామకాల్లో జడ్పీ హెచ్‌ఎంలకు జరుగుతున్న అన్యాయాన్ని పరిష్కరించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆదివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉత్తర్వులు 10 ప్రకారం జడ్పీ హెచ్‌ఎంను బదిలీ ద్వారా ఎంఈవో పోస్టుల్లో నియమించాలని స్పష్టమైన ఆదేశాలున్నప్పటికీ, ఉన్నతాధికారులు పరిశీలించకుండా సీఎం, విద్యాశాఖ మంత్రిని తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పునే కొనసాగిస్తూ మరింత అన్యాయానికి గురిచేస్తున్నారని విమర్శించారు. ఉపాధ్యాయ సంఘాలు ఎన్నిసార్లు ప్రాతినిధ్యం వహించినా ఉన్నతాధికారులు ప్రభుత్వ యాజమాన్యం ఉపాధ్యాయులవైపే మొగ్గుజూపుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ జీవో ఉత్తర్వుల ప్రకారం ఐదేళ్ల గ్రేడ్-2 హెచ్‌ఎంగా సర్వీసు పూర్తిచేసిన వారికే ఎంఈవోగా నియమించాలని స్పష్టంగా ఉన్నప్పటికీ, నిబంధనలను ఉల్లంఘించి ఇటీవల గవర్నమెంట్ మేనేజ్‌మెంట్ టీచర్లకు ఎంఈవో పోస్టులను ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ఏకీకృత సర్వీసురూల్స్‌కు, ఎంఈవో పోస్టులను అసలు సంబంధంలేకపోయినా కోర్టు తీర్పులను బూచిగా చూపి ఎంఈవో-1 పోస్టులను ప్రభుత్వ యాజమాన్య ఉపాధ్యాయులతో భర్తీ చేసి విద్యావ్యవస్థలో గందరగోళానికి తెరలేపారని ఆరోపించారు. మండల వ్యవస్థ ఆవిర్భవించినపుడు ఏర్పడిన ఎంఈవో పోస్టులను నిబంధనలకు విరుద్ధంగా విభజించడం అసంబద్ధమన్నారు. ఒకే హోదా, సమాన అధికారాలున్న ఎంఈవో పోస్టులను భర్తీచేసేటపుడు కామన్ కౌన్సెలింగ్‌తో సీనియర్లను డీడీవోలుగా బదిలీచేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే మండలాన్ని రెండు సెక్టార్లుగా విభజించి, ఎంఈవో-1, 2 లిద్దరూ డీడీవోలుగా పరిపాలనచేసేలా ఉత్తర్వులివ్వాలని డిమాండ్ చేశారు. గత 8 ఏళ్లుగా ఎంఈవో-1లు ఒకేచోట పనిచేస్తున్నందున మండల విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందని, ప్రభుత్వం వెంటనే స్పందించి సుదీర్ఘకాలంగా ఒకే మండలంలో పనిచేస్తున్న ఎంఈవో-1లను తప్పనిసరిగా బదిలీచేయాలని, ఆ మేరకు ఎంఈవో-2లకు రిక్వెస్టు ట్రాన్సఫర్లు జరిపి జడ్పీ టీచర్లకు న్యాయం చేయాలని కోరారు.

గుబ్బల మంగమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ


గుబ్బల మంగమ్మను దర్శించుకున్న భక్తులు

బుట్టాయగూడెం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): పశ్చిమ ఏజెన్సీలో గుబ్బల మంగమ్మను దర్శించుకునేందుకు ఆదివా రం భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు అనంతరం అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అమ్మవారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. సోమవారం నుంచి అమ్మవారి ఆలయం వద్ద దసరా ఉత్సవాలను నిర్వహించడానికి కమిటీ ఏర్పాట్లు చేసింది. అయితే ఉత్సవాల్లో వాతావరణం అనుకూలించకుంటే భక్తులు ఆలయానికి రావద్దని స్పష్టం చేశారు.


ఎన్టీఆర్ నాటిన ఆయిల్‌పామ్ చెట్టుదగ్గర ఛత్తీస్‌గఢ్ సీఎం ఓఎస్డీ తులసీ కౌసిక్

ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు చర్యలు
తోటలు పరిశీలించిన ఛత్తీస్‌గఢ్ సీఎం ఓఎస్డీ తులసీ కౌసిక్

పెదవేగి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు చర్యలు తీసుకుంటామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి ఓఎస్డీ తులసీ కౌసిక్ తెలిపారు. కొప్పులవారిగూడెం పంచాయతీ సీతాపురంలో ఆయిల్‌పామ్ తోటలను ఆదివారం ఆయన పరిశీలించారు. 1987లో అప్పటి ఏపీ ముఖ్యమంత్రి దివంగత ఎన్టీ రామారావు నాటిన ఆయిల్ పామ్ చెట్టును ఆయన సందర్శించారు. ఉద్యాన పంటల రాబడిలో రారాజు ఆయిల్‌పామ్ అన్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఆయిల్‌పామ్ తోటల విస్తరణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇక్కడ ఆయిల్‌పామ్ సాగు అద్భుతంగా ఉందని, సాగులో మెళకువలు, యాజమాన్య విధానాలపై త్వరలో ఛత్తీస్‌గఢ్ నుంచి ఔత్సాహిక రైతులు, శాస్త్రవేత్తలు, ప్రభుత్వ ప్రతినిధులతో ఒక బృందాన్ని ఇక్కడికి పంపిస్తామని ఆయన తెలిపారు. తులసీ కౌసిక్ వెంట కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉండవల్లి వెంకట్రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సీహెచ్. విక్రమ్‌కిశోర్, జిల్లా కార్యదర్శి కేవీఎస్.వరప్రసాద్, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆర్‌ఎస్ఎస్.చక్రధరరావు, చింతలపూడి నియోజకవర్గం కన్వీనర్ వరప్రసాద్, పామాయిల్ రైతు ఉండవల్లి రాము పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్‌లో అంతర పంటలు పరిశీలించిన
తెలంగాణ మంత్రి తుమ్మల


లక్ష్మీపురంలో తోట పరిశీలిస్తున్న తుమ్మల

జీలుగుమిల్లి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటగా కోకో, వక్క సాగుతో అధిక ఆదాయం పొందవచ్చని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. జీలుగుమిల్లి మండలం లక్ష్మీపురంలో రైతు కొల్లూరి రాంబాబు ఆయిల్‌పామ్ తోటలో అంతర పంటలుగా సాగు చేస్తున్న కోకో వక్క పంటల్ని ఆదివారం మంత్రి తుమ్మల పరిశీలించారు. తెలంగాణ, ఆంధ్రలో తోటల సాగులో తేడా పరిశీలించినట్లు చెప్పారు. అంతర పంటల సాగుపై శాస్త్రవేత్తలతో కూడా చర్చలు జరిపినట్లు మంత్రి తెలిపారు. తెలంగాణలో ఆయిల్‌పామ్ రైతులకు గిట్టుబాటు ధర కల్పిం చడంతో ఇక్కడి రైతులకు కూడా మంచి ధర లభిస్తుందని రైతులు తెలిపారు. కేతిరెడ్డి రాఘవరెడ్డి, కొప్పుల చౌదరి రెడ్డి, బండి భాస్కర్, పైడి వెంకటేశ్వరావు ఉన్నారు.



నాసికా వేణుగానం ఆలపిస్తున్న నాగభూషణ, శ్రీసాయి హేమంత్

ఆలపాటి సేవలు మరువలేనివి
ముగిసిన ఆలపాటి శత జయంత్యుత్సవం

ఏలూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక, కళారంగాలకు ఆలపాటి రామచంద్రారావు అందించిన కృష్ణ శ్లాఘనీయమని వక్తలు కొనియాడారు. అంబికా సంస్థలు, హిందూ యువజన సంఘం సంయుక్త నిర్వహణలో వైఎంహెచ్ఏలో రెండు రోజులు సాగిన ఆలపాటి రామచంద్రరావు శత జయంత్యుత్సవాలు ఆదివారం ముగిశాయి. నాసికాగ్ర నాగభూషణ, శ్రీసాయి హేమంత్ కృష్ణ బృందం 'నాసికా వేణునాదం' రసవత్తరంగా సాగింది. గుడిపాటి లలితాశర్మ నిర్వహణలో ఏర్పాటు చేసిన హేలాపురి సంగీత సౌరభంలో సంగీత కళాకారులు టి.శుభ, డి.శైలజ, పి సావిత్రికుమారి, ఏ.పార్వతిరామచంద్రన్ తదితరుల శాస్త్రీయ గీతాలు శ్రోతలను ఆద్యంతం అలరించాయి. కార్యక్రమంలో అంబికా సంస్థల చైర్మన్ అంబికా కృష్ణ, అంబికా ప్రసాద్, అంబికా రాజా, యర్రా సోమలింగేశ్వరరావు, కేవీ సత్య నారా యణ, వేణుగోపాల్ లునానీ, ఎంవీవీఎస్ నాగేశ్వరరావు, వేమా కోటేశ్వరరావు పాల్గొన్నారు.

అమ్మవారి ప్రత్యేక అవతారాల అంతరార్థం ఇదే..



తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): దసరా విజయానికి ప్రతీక. తొమ్మిది రోజులు ఏ అవతారంలో అమ్మవారిని పూజిస్తే మనకు ఎలాంటి సౌఖ్యాలు కలుగుతాయో వీరంపాలెం బాలాత్రిపుర సుందరి పంచాయతన క్షేత్రం వ్యవస్థాపకులు గరిమెళ్ల వెంకట రమణ సిద్ధాంతి వివరించారు.

- మొదటి రోజు శైలపుత్రి
  అమ్మ ఏకాగ్రతకు ప్రతీరూపం. నిశ్చలమైన మనస్సును ఆధీనంలో ఉంచేందుకు అమ్మవారిని కొలుస్తుంటారు.
- రెండో రోజు అలంకరణ బ్రహ్మచారి
  నిశ్చలమైన, ఏకాగ్రత, నిగ్రహం అన్నింటిని ఆధీనంలో ఉంచుకునే సర్వేంద్రియాలను మనస్సుతో నిగ్రహించే శక్తిని ప్రసాదించే అమ్మవారి బ్రహ్మచారిణిగా కొలుస్తాం.
- మూడో రోజు చంద్రగంటాదేవి
  అధిష్ఠాన దేవతగా అమ్మవారు అన్ని దుఃఖాలను నియంత్రించే అమ్మను కొలవడం జరుగుతుంది.
- నాలుగో రోజు కూష్మాండ దేవి
  పిల్లల్ని అనుగ్రహించే దేవతా మూర్తిగా అమ్మ ప్రతీతి. అమ్మవారు వారణాసిలో శ్రీ చక్రంలో కొలువైన కూష్మాండ దేవి అవతారం ప్రసిద్ధి.
- ఐదో రోజు స్కంద మాత
  ఈశ్వరానుగ్రహం పొందిన అమ్మవారు సంతాన దేవతగా సంతానం లేనివారికి అనుగ్రహించే మాతగా భావించి కొలుస్తుంటారు.
- ఆరో రోజు కాత్యాయని
  పరమేశ్వరుడిని ఉపాసించిన కాత్యాయని దేవి వైధవ్యం లేకుండా చేస్తుందని నమ్మకం.
- ఏడో రోజు కాళరాత్రి దేవి
  అకాల మృత్యువు మన దరిచేకుండా అమ్మవారు చూస్తుంటారు. మృత్యుభయం లేకుండా ఉండేందుకు అమ్మవారి అనుగ్రహం ముఖ్యం.
- ఎనిమిదో రోజు మహా గౌరి
  అమ్మవారు సౌభాగ్యం, సంతానాభివృద్ధి కలిగించే వరప్రదాయినిగా ప్రసిద్ధి.
- తొమ్మిదో రోజు సిద్ధ ధాత్రి
  ఎనిమిది రోజులు నిష్ఠతో పూజించిన భక్తుల కోర్కెలు సిద్ధించేలా చేసే సిద్ధదాయిని.


భీమవరంలో ఆలయం వద్ద విద్యుత్ దీపాలంకరణ

దసరా శోభ
శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబు


భీమవరంలో శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు

భీమవరం టౌన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో దేవీ నవరాత్రుల ఉత్సవాలకు అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సోమవారం నుంచి వచ్చేనెల 2వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ ఏడాది తిథి ద్వయం రావడంతో 11 రోజులపాటు ఉత్సవాలు జరగనున్నాయి. అమ్మవార్లను కూడా 11 అవతారాలలో దర్శనమిస్తారు.

భీమవరం మావుళ్లమ్మ ఆలయం వద్ద ప్రత్యేక విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు మద్దిరాల మల్లికార్జున శర్మ పర్యవేక్షణలో అమ్మవారికి అలంకారాలు చేయనున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. పంచారామ క్షేత్రమైన గునుపూడిలోని సోమేశ్వర స్వామి ఆలయంలో పార్వతీ అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు చేయనున్నారు. భీమేశ్వర స్వామి ఆలయంలోను మహిషాసుర మర్ధిని అమ్మవారికి, గునుపూడి ఆదిలక్ష్మి అమ్మవారి ఆలయంలోను ఉత్సవాల ఏర్పాట్లు పూర్తి చేశారు. వీటితోపాటుగా పాలకొల్లులో పంచారామ క్షేత్రమైన క్షీరారామలింగేశ్వర స్వామి దేవస్థానం, దువ్వ దానేశ్వరి, పెనుగొండ వాసవీ కన్యకా పరమేశ్వరి, పెంటపాడు బైరాగిమఠం, ద్వారకాతిరుమల కుంకుళ్లమ్మ, పెదవేగి రాట్నాలమ్మ, తాడేపల్లిగూడెం వనుమలమ్మ తదితర ప్రముఖ దేవాలయాల్లో ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు.

వైభవంగా అమ్మవారి శోభాయాత్ర

మావుళ్లమ్మ దేవస్థానం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం వైభవంగా శోభాయాత్ర నిర్వహించారు. వందలాది మంది మహిళలు కలశాలు చేతబట్టుకుని అమ్మవారి నామస్మరణ చేస్తుండగా వేద మంత్రాలతో శోభాయాత్ర ప్రారంభమైంది. ఆలయం వద్ద నుంచి ప్రారంభమైన యాత్ర పురవీధుల మీదుగా సాగింది. దేవస్థానం సహాయ కమిషనర్ బుద్ది మహాలక్ష్మి నగేష్, ఆలయ ప్రధాన అర్చకుడు మద్దిరాల మల్లికార్జున శర్మ పర్యవేక్షించారు. తిరిగి ఆలయానికి చేరుకున్న మహిళలు అమ్మవారిని దర్శించుకున్నారు. వందలాది మంది మహిళలు తరలిరావడంతో అమ్మవారి ఆలయం వద్ద ఒక రోజు ముందుగానే నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమైనట్లుగా కనిపించింది.

భవానీ దీక్షలు ప్రారంభం

దేవీ నవరాత్రుల సందర్భంగా అమ్మవారి భక్తులు నవరాత్రుల్లో భవానీ మాలలు వేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే పట్టణాలు, గ్రామాల్లో భవానీ పీఠాలను ఏర్పాటు చేసుకున్నారు. ఎర్రని దుస్తులు ధరించి నియమ నిష్ఠలతో పూజ మొదలెడుతున్నారు.

బైరాగిమఠం వేడుకలకు సిద్ధం


కె.పెంటపాడు బైరాగిమఠం

పెంటపాడు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.పెంటపాడు గోపాలస్వామి అంజనేయ స్వామి (బైరాగిమఠం) ఆలయంలో ఈవో బీవీ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో దసరా వేడుకలకు ఘనంగా నిర్వహించనున్నారు. ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రతీ రోజు ఆలయంలో కుంకుమ పూజలు, హోమాలు జరుగుతాయని ఈవో తెలిపారు. ప్రత్తిపాడు వై.జంక్షన్ కనకదుర్గమ్మ ఆలయంలో ఈవో యాళ్ల శ్రీధర్ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి వేడుకలను నిర్వహించనున్నారు. ప్రతీ రోజు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేస్తారు.

పండగ ఆఫర్స్
మార్కెట్‌లో దసరా సందడి





దసరా అంటేనే ప్రతి ఇంట సందడే సందడి. వ్యాపార సంస్థలు తమ వస్తువులపై ఆఫర్లు ప్రకటిస్తుంటాయి. విజయ దశమి రోజున కొత్త వస్తువులను కొనుగోలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. గృహోపకరణాలు, బైక్‌లు, కార్లను ఎక్కువగా ఈ పండుగ రోజునే కొనుగోలు చేస్తుం టారు. మోటార్ సైకిల్ షోరూమ్‌లు, కార్ల షోరూమ్‌ల వారు ప్రత్యేకంగా శిబిరాలు ఏర్పాటు చేశారు. ప్రతీ చోట మెగా లోన్ ఎక్స్ఛేంజ్ మేళాలను నిర్వహిస్తున్నారు. వస్త్ర వ్యాపారం జోరుగా సాగుతుంది.

- హోరెత్తుతున్న వ్యాపార ప్రకటనలు
- మార్కెట్‌లో కొత్త వాహనాలు
- ప్రత్యేక మేళా.. డిస్కౌంట్‌లు

ఏలూరు సిటీ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఈసారి దసరా పండుకకు వివిధ రకాల ఆపర్లు ప్రకటించడంతో అమ్మకాలు జోరందుకుంటాయని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. మోటార్ వాహనాలపై జీఎస్టీ 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించడంతో ఒక్కొక్క మోటార్ సైకిల్‌కు మోడల్‌ను బట్టి రూ.ఆరు వేల నుంచి రూ.12వేల వరకు తగ్గనున్నాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. మార్కెట్‌లో కొత్త వాహనాలు లాంఛింగ్ చేయడంతో పాటు గతంలో ఉన్న మోడల్స్‌కు ప్రత్యేక ఆఫర్లు ప్రకటించడంతో దసరా హడావుడి ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. ఏలూరు నగరంతో పాటు జిల్లాలోని వివిధ పట్టణాల్లో ఎలక్ట్రానిక్ వస్తువులు అమ్మే వ్యాపారులు, వివిధ మోటార్ సైకిల్ సంస్థలు, కార్ల షోరూమ్‌లు, వస్త్ర వ్యాపారులు, ఎలక్ట్రానిక్స్ షోరూమ్‌లు ప్రత్యేక డిస్కౌంట్ ఆఫర్లను ప్రకటించారు. ఈసారి ఎలక్ట్రికల్ బైక్‌లపై ప్రత్యేక ఆఫర్లను ప్రకటించారు. మోటార్ సైకిల్ కంపెనీలు డిస్కౌంట్ ఆఫర్లను, జీరో వడ్డీ ఆఫర్లను ఇస్తున్నారు. జిల్లాలో మోటార్ సైకిల్ సంస్థలు ఎక్స్ఛేంజ్ మేళాలు నిర్వహిస్తున్నాయి. ఫైనాన్స్ అందజేసేటప్పుడు డౌన్ పేమెంట్ లేకుండా వారు ఎంత వరకు చెల్లించగలరో అంతవరకు తీసుకుని కొత్త వాహనాలను ఇస్తున్నారు. ఫ్రిజ్‌లు, ఏసీలు, వాషింగ్ మిషన్లు, కూలర్లు, గ్రైండర్లు, మైక్రోఓవెన్స్, మిక్సీలు, ఎల్ఈడీ టీవీలతో పాటు ఇతర గృహోపకరణాలపై కొన్ని సంస్థలు స్క్రాచ్ కార్డు ఆఫర్లు ప్రకటించగా, కొన్ని కంపెనీలు డిస్కౌంట్ ప్రకటించాయి.

వాహనాల ధరలు తగ్గాయి..



జీఎస్టీ తగ్గడంతో మోటార్ సైకిళ్ల ధరలు భారీగా తగ్గుతున్నాయి. మోడల్‌ను బట్టి రూ.6వేల నుంచి రూ.12 వేల వరకు తగ్గే అవకాశం ఉంది. వివిధ కంపెనీలతో పాటు ఆన్‌లైన్ సంస్థల ప్రత్యేక ఆఫర్లతో మోటార్ వెహికల్స్ ధరలు భారీగా తగ్గనున్నాయి. సరికొత్త మోడల్స్ అత్యాధునిక సదుపాయాలతో వాహనాలు వినియోగదారులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. మా కంపెనీ మోడల్‌ను అనుసరించి రూ.3వేల నుంచి రూ.5 వేల వరకు క్యాష్‌బాక్ ఆఫర్లు ఇస్తున్నాం. ఆన్‌లైన్ ఆఫర్లు కూడా కలిసివస్తే ప్రతి వెహికల్ కొనుగోలుపై మోడల్‌ను అనుసరించి రూ.15వేల నుంచి రూ.20వేల వరకు డిస్కౌంట్ లభించే అవకాశాలున్నాయి. ఈ సారి ఎలక్ట్రికల్ వెహికల్స్ మార్కెట్‌లోకి రావడంతో వాటిని కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ఈ ఏడాది గతేడాది కంటే అధికంగానే వ్యాపారం ఉంటుందని భావిస్తున్నాం.

ఎ.వి.సోమేశ్వరరావు, సాయిస్వర్ణ మోటార్స్ జనరల్ మేనేజరు, ఏలూరు


మిరాయ్ మ్యూజిక్ డైరెక్టర్ గౌర హరిని సత్కరిస్తున్న ఆరిమిల్లి

మిరాయ్ సంగీత దర్శకుడు
గౌర హరికి సత్కారం

తణుకు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మిరాయ్ సంగీత దర్శకుడు గౌర హరి తణుకు ప్రతిష్ఠను ఇనుమడింపజేశారని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. తణుకు లక్ష్మీ థియేట ర్‌లో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన అభినందన సభలో హరిని సత్కరించారు. హరి సంగీత దర్శకత్వం వహించిన రెండు చిత్రాలు పాన్ ఇండియాలో ఘన విజయం సాధించడం అభినందనీయమన్నారు. తణుకులో విద్యాభ్యాసం చేసి సినీ రంగంలో ప్రత్యేక స్థానం సాధించుకున్న హరి భవిష్యత్‌లో మరిన్ని విజయాలు అందించాలని ఆకాంక్షించారు. అనంతరం లక్ష్మీ థియేటర్‌లో నిర్వహించిన సంబరాల్లో పాల్గొని, ఎమ్మెల్యే రాధాకృష్ణతో కలసి చిత్రాన్ని వీక్షించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

నిండు జీవితం నిలబడింది


మహిళను అభినందిస్తున్న మహిళా పోలీస్ స్టేషన్ సీఐ సుబ్బారావు

- నాలుగు నెలల క్రితం మహిళ ఆత్మహత్యాయత్నం
- సకాలంలో స్పందించి కాపాడిన శక్తి టీం
- తాజా డీఎస్సీలో టీచర్ ఉద్యోగం సాధించిన మహిళ
- మహిళా పోలీస్ స్టేషన్ సిబ్బంది అభినందనలు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మానసిక ఒత్తిడితో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళను ఏలూరు శక్తి టీమ్ పోలీసులు సకాలంలో కాపాడి ఆమె ప్రాణాలను నాడు నిలిపారు. పోలీసుల కౌన్సెలింగ్‌తో ఆమె జీవితంలో ముందడుగు వేసింది. మెగా డీఎస్సీలో నేడు ఉద్యోగం సాధించింది. కష్టాల నుంచి గటెక్కానని, పిల్లలను కూడా ఉన్నత చదువుల దిశగా నడిపిస్తున్నానని ఆత్మవిశ్వాసంతో చెబుతుంది.

కృష్ణాజిల్లాకు చెందిన యువతి పదో తరగతి వరకు చదివి ఆర్థిక పరిస్థితుల కారణంగా చదువు మానేసింది. ఏలూరులో అమ్మమ్మ ఇంటికి తరచుగా రావడంతో ఆ ఇంటి పక్కనే యువకుడితో పరిచయం పెళ్లికి దారి తీసింది. తర్వాత ప్రైవేటుగా ఇంటర్మీడియట్, డిగ్రీ, ఎంఏ, బీఈడీ చదివింది. ప్రైవేటు టీచరుగా పనిచేస్తూ ఇద్దరు పిల్లలను పోషించుకుంటుంది. అంతలో ఆమె జీవితంలో భారీ కుదుపు. భర్త వ్యసనాలకు బానిస కావడంతో తరచు గొడవలు. అతడి వేధింపులు భరించలేక 2024లో కోర్టు నుంచి విడాకులు కూడా తీసుకుంది. తర్వాత స్నేహితురాలి సూచనతో విడాకులు తీసుకున్న భర్తతో సర్దుబాటు చేసుకుంది. తిరిగి పిల్లలు, భర్తతో ఏలూరులోనే నివాసం ఉన్నారు. తర్వాత కొన్నాళ్లకు భర్త వేధింపులు యధాతథం కావడంతో చనిపోవాలనుకుంది.

రైలు పట్టాలపై నిలబడి..

గడచిన మే 23న ఏలూరు ఎన్‌ఆర్‌పేట వద్ద రైలు పట్టాలపై నిలబడింది. స్థానికులు గమనించి వెంటనే 112కు కాల్ చేశారు. వెంటనే స్పందించిన మహిళా పోలీస్ స్టేషన్ సీఐ, శక్తి టీమ్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు, మహిళా కానిస్టేబుళ్లు సుజాత, శ్రావణి, సిబ్బంది కలిసి రైలు పట్టాల నుంచి ఆమెను పక్కకు లాగారు. ఆ మరుక్షణం రైలు దూసుకుపోయింది. ఒక్కక్షణం ఆలస్యమైనా ప్రాణాలు కోల్పోయేది. పోలీసులు ఆమెతో పాటు ఆమె భర్తను కూడా పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు.

మలుపు తిప్పిన డీఎస్సీ

ప్రభుత్వం ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి మెగా డీఎస్సీ ప్రకటించడంతో ఆమె జీవితం మలుపు తిరిగింది. పట్టుదలతో చదివి డీఎస్సీలో విజయం సాధించి ఓపెన్ క్యాటగిరిలో స్కూలు అసిస్టెంట్‌గా ఎంపికైంది. తనువు చాలించాలని నిర్ణయించుకున్నా.. ఒత్తిడి, కష్టాలను అధిగమించి జీవితంలో గెలిచిన ఆమెను మహిళా పోలీసుల మళ్లీ పిలిచారు. మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం.సుబ్బారావు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. తన జీవితం, కుటుంబాన్ని నిలబెట్టుకోవడమే కాకుండా ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత చేపట్టడం స్ఫూర్తిదాయకం అన్నారు. మహిళ జీవితాన్ని మార్చిన శక్తి టీమ్ సభ్యులను సీఐ అభినందించారు.

క్షణికావేశంలో తీవ్ర నిర్ణయం..

క్షణికావేశంలో తీసుకున్న తీవ్ర నిర్ణయం తన పిల్లల భవిష్యత్‌ను కూడా చిదిమేసి ఉండేదని, అన్ని కష్టాలను అధిగమించి ముందుకు సాగుతున్నాని ఆమె ఆనందంగా చెప్పింది. తన ఇద్దరు పిల్లలు ట్రిపుల్ ఐటీలో చదువుతున్నారని సంతోషంగా చెప్పింది. శక్తి టీమ్ పోలీసులు తనలో ఆత్మస్థైర్యం నింపారని, ముందడుగు వేసి డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపిక కావడం ఎంతో ఆనందంగా ఉందని ఆమె చెప్పింది. ఆ మహిళను పలువురు అభినందించారు. సీఐ సుబ్బారావుతోపాటు, శక్తి టీమ్ సభ్యులైన మహిళా ఎస్ఐ నాగమణి, మహిళా కానిస్టేబుళ్లు సుజాత, గౌరీ, దేవి, గోపాల్ ఆమెను అభినందించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): గాయాలతో కోర్టు ఆవరణలో పడిఉన్న వ్యక్తిని ఆర్టీసీ ఉద్యోగి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న అతడు ఆదివారం మృతి చెందాడు. ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలో ఈనెల 14న ఒక వ్యక్తి గాయాలతో పడిఉండగా ఆర్టీసి ఉద్యోగి గమనించి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుని వివరాలు తెలిసిన వారు ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

దాడి.. చోరీ కేసులో నిందితుడి అరెస్ట్


పోలీసుల అదుపులో నిందితుడు

మొగల్తూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళపై దాడి చేసి ఆమె మెడలో బంగారం దోచేసిన నిందితుడిని ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. నరసాపురం సీఐ దుర్గాప్రసాద్ ఆదివారం వివరాలు తెలిపారు. మొగల్తూరు మండలం కాళీపట్నం తూర్పు గ్రామానికి చెందిన బళ్ళ సూర్య ఆదిలక్ష్మి (55) ఒంటరిగా ఉంటుందన్నారు. కొద్దిపాటి మొత్తాలను వడ్డీలకు ఇస్తూ జీవనం సాగిస్తుందన్నారు. గ్రామానికి చెందిన మార్రోజు శ్రీనివాస్ ఆదిలక్ష్మి వద్ద గతంలో రూ.10వేలు అప్పు తీసుకున్నాడన్నారు. బకాయి తీర్చకుండానే మళ్లీ మరో రూ.20వేలు అప్పు అడిగాడు. అప్పు విషయమై ఇద్దరి మధ్య చర్చలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆదిలక్ష్మి ఇంటిలో ఉన్న కొద్దిపాటి కలప విక్రయించాలని శ్రీనివాస్‌ను అడిగి కలప చూసేందుకు ఇంటికి రమ్మని చెప్పినట్లు సీఐ వివరించారు. శనివారం ఉదయం ఆదిలక్ష్మి కలప చూపుతుండగానే శ్రీనివాస్ ఆమెపై కర్రతో దాడిచేసి తీవ్రంగా గాయపర్చడంతో గట్టిగా అరుస్తూ కిందికి పడిపోయింది. స్థానికులు గమనించి అక్కడికి వచ్చేసరికి శ్రీనివాస్ ఆమె మెడలో బంగారు బొందు, చెవిదిద్దులు అపహరించి ఇంటి వెనుక నుంచి పరారయ్యాడన్నారు. స్థానికులు ఆదిలక్ష్మిని ఆసుపత్రికి తరలించగా బాధితురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కాళీపట్నం చేపల చెరువు వద్ద దాక్కున్న నిందితుడు శ్రీనివాస్‌ను ఆదివారం అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. సీఐతో పాటు ఎస్ఐ జి.వాసు, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

అపార్టుమెంటులో చోరీ


పోలీసుల అదుపులో నిందితుడు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వచ్చేటప్పటికి దొంగలు తాళాలు పగుల గొట్టి రూ.లక్ష నగదు అపహరించుకుపోయరు. ఏలూరు ఆర్టీవో ఆఫీస్ సమీపం లోని ఉండవల్లి అపార్టుమెంట్‌లో డాక్టర్ కె.శైలజ నివాసం ఉంటున్నారు. ఈనెల 17న తన కుటుంబంతో షిరిడీ వెళ్లారు. తిరిగి ఆదివారం వచ్చేటప్పటికి తాళాలు పగుల గొట్టి ఉన్నాయి. ఇంట్లో లక్ష రూపాయల నగదు అపహరించినట్లు గుర్తించారు. ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ, రూరల్ ఎస్ఐ జి.నాగబాబు, సిబ్బంది సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్ సంఘటనా స్థలానికి వచ్చి ఆధారాలను సేకరించారు.

ఆర్థిక అక్షరాస్యతపై నాయుడుగూడెంలో అవగాహన

పెదపాడు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో పెదపాడు మండలం నాయుడుగూడెం సచివాలయంలో డిజిటల్, ఆర్థిక అక్షరాస్యతపై ఏరియా కో-ఆర్డినేటర్ గోసాల ఝూన్సీరాణి అధ్యక్షతన అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా ఏలూరు జిల్లా సహకార కేంద్రబ్యాంకు జనరల్ మేనేజర్ గుబ్బలరావు పాల్గొని బ్యాంకింగ్ సేవలను వివరించారు. డీసీజీ బ్యాంకు మేనేజరు శ్రీనివాస్ మాట్లాడుతూ బ్యాంకు వివరాలు ఎవ్వరు అడిగినా చెప్పవద్దన్నారు. మహిళా పోలీసు కేవీ లక్ష్మి, వీఆర్వో ప్రసాద్, ఎఫ్.ఏ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైద్య భగవానుడికి సామూహిక పూజలు

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మహాలయ అమావాస్య సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం పవరుపేట స్టేషన్ రోడ్డులోని శ్రీధన్వంతరి వైద్య భగవానుడి ఆలయంలో భక్తులు సామూహికంగా అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రాళ్ళబండి ఆదినారాయణశర్మ భక్తుల గోత్రనామాలతో అర్చనలు జరిపి భక్తులకు రక్షాబంధనాలు కట్టారు. ఆలయ చైర్మన్ కోరాడ రెడ్డి, బూరాడ పూర్ణ చంద్రరావు మిత్రబృందం భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు.

వైసీపీ నేత రామరాజు ఇంటిముందు ఆందోళన

ఏలూరు,సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత మోరురామరాజు ఇంటిని వడ్డిగూడెం గ్రామస్థులు మరోమారు ఆదివారం ముట్టడించారు. గత వైసీపీ పాలనలో ఇంటి స్థలాలు ఇప్పిస్తానని, రూ.57లక్షలు తీసుకుని ఇవ్వకుండా మోసం చేశారని ఆరోపిస్తూ శనివారపుపేటలోని కట్టా సుబ్బారావుతోటలోని ఆయన నివాసం వద్ద ఆందోళన చేపట్టారు. తమకు డబ్బు తిరిగి చెల్లించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. బాధితులు ముంగర విష్ణు, జయమంగళ హరిబాబు, ఘంటసాల మారుతి, సర్పంచ్ జయమంగళ దేవి మాట్లాడుతూ రామరాజు అనే వ్యక్తి 15 ఏళ్ల క్రితం పొలం కొనుగోలు చేసి స్థలాలు ఇస్తానని 560 మంది నుంచి రెండు విడతలుగా రూ.57లక్షలు వసూలు చేశారని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

జీలుగుమిల్లి సర్కిల్ పరిధిలో పోలీస్ యాక్ట్

జీలుగుమిల్లి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): జీలుగుమిల్లి సర్కిల్ పరిధిలో 144, 30పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నట్టు సీఐ బి.వెంకటేశ్వరరావు చెప్పారు. శాంతి భద్రతలకు విఘాతం కల్గించేలా ర్యాలీలు, ధర్నాలు, సమావేశాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఎవరైనా ధర్నాలు, ర్యాలీలు నిర్వహించాల్సి వస్తే పోలీస్‌లకు ముందస్తుగా సమాచారం ఇవ్వాలన్నారు. సర్కిల్ పరిధిలో జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, టి.నరసాపురం మండలాల్లో శాంతి భద్రతలపై దృష్టి సారించామన్నారు. సోషల్ మీడియాలో కులాలు, మతాలు వివిధ రాజకీయ పార్టీలను రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సంబంధిత వాట్సాప్ గ్రూపు అడ్మిన్‌లు బాధ్యతగా వ్యవహరించాల్సి ఉంటుందన్నారు.

పెయింటింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక ఇఫ్టూ కార్యాలయంలో ఆదివారం నగరంలోని పెయింటింగ్ కార్మికుల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. సమావేశానికి లొట్ల సత్యనారాయణ అధ్యక్షత వహించారు. కొత్త కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ గౌరవ అధ్యక్షులు షేక్ హలీమ్, అధ్యక్షులుగా సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా కోరాడ రెడ్డి, మెంతుల వెంకట రమణ, ప్రధాన కార్యదర్శిగా మీసాల ప్రసాద్, సహాయ కార్యదర్శిగా దుర్గాసి ప్రతాప్, సహకార కార్యదర్శిగా జంపాల కృష్ణ, కోశాధికారిగా పైడిరాజులను ఎంపిక చేశారు.

కార్మిక సంక్షేమానికి ఏఐటీయూసీ పోరాటం



కొయ్యలగూడెం, సెప్టెంబర్ 21(ఆంధ్రజ్యోతి): కార్మిక సమస్యల కోసం ఏఐటీయూసీ ఎన్నో ఏళ్లగా పోరాటం చేస్తుందని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ డాంగే, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను మార్పు చేస్తూ హక్కులను హరించివేస్తోందన్నారు. ఆ కార్మిక చట్టాలను పరిరక్షించుకోవాలన్నారు. సీపీఐ మండల కార్యదర్శి అంజనేయరాజు, వెలగా వెంకటేశ్వరరావు, చిట్టిబాబు పాల్గొన్నారు.



సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్న రిక్షా కార్మికులు

రిక్షా కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కొయ్యలగూడెం, సెప్టెంబర్ 21(ఆంధ్రజ్యోతి): రిక్షా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని స్థానిక రిక్షా కార్మికులు జనసేన పార్టీ కార్యాలయానికి వెళ్లి పట్టణ జనసేన అధ్యక్షుడు మాదేపల్లి శ్రీనుకు సమస్యలను తెలిపారు. తాము ఎంతో కాలంగా రిక్షాలు నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నామన్నారు. అయితే 50ఏళ్లు పైబడిన అందరికీ పింఛన్ సదుపాయం కల్పించేలా బీమా సౌకర్యాన్ని కల్పించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ సమస్యలన్నీ జనసేన పార్టీ మండలాధ్యక్షుడు తోట రవి ద్వారా ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. జనసేన నాయకులు గొలిశెట్టి శ్రీను, బీజేపీ మండలాధ్యక్షుడు గొలిశెట్టి వాసు ఉన్నారు.

కొవ్వలి వికాస కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం

దెందులూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): వ్యాధులను మొదటి దశలో గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలని ఏషియన్ వాస్కులర్ హాస్పిటల్స్ వైద్యురాలు డాక్టర్ స్వాతి, చర్మ వ్యాధి నివారణ వైద్యులు డాక్టర్ సుబ్బారావు అన్నారు. ఆదివారం కొవ్వలి వికాస కేంద్రం(మొటపర్తి భవన్)లో ఏలూరు వేంగి జెమ్స్ లయన్స్ క్లబ్ పూర్వ జిల్లా గవర్నర్ వేమ కోటేశ్వరరావు, రీజియన్ చైర్ పర్సన్ వి.శ్రీనివాస గోపాల్, ప్రెసిడెంట్ రవితేజ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ కొడాలి రామ్ ప్రసీన్, డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ స్వాతిల బృందం రూ.5 వేల విలువ చేసే రక్తనాళాల పరీక్షలను ఉచితంగా 160 మందికి చేశారు. 24 మందికి వేరికోస్ వీన్స్ నిర్ధారణతో ఉచితంగా వీరికి హైదరాబాద్‌లో తామే తీసుకెళ్లి ఉచితంగా ఆపరేషన్ చేయిస్తామని, సిద్ధం కావాలన్నారు. ఈ వైద్య శిబిరంలో లయన్స్ క్లబ్ మెంబర్ గార పాటి శ్రీనివాస్, మోటపర్తి నారాయణరావు ఉన్నారు.

మార్కెట్ జోష్!

(5వ పేజీ తరువాయి)

రెవెన్యూ, గ్రామసచివాలయాల ఉద్యోగులతో కలిసి ప్రజల్లోకి వెళ్లనున్నారు. ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చేపట్టిన చొరవతోనే జీఎస్టీ ధరాభారం తగ్గిందనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఏలూరు నగరంలో సోమవారం ఉదయం 10 గంటలకు పెద్ద పోస్టాఫీస్ నుంచి కుండి సెంటర్ మీదుగా గడియార స్తంభం, మెయిన్‌బజార్, చందనా బ్రదర్స్ వరకు బీజేపీ నాయకులు కూటమి నేతలు, కార్యకర్తలతో కలిసి ప్రదర్శన నిర్వహించనున్నారు.

కల సాకారం అయ్యేనా!

(5వ పేజీ తరువాయి)

వారే. మహిళల ఓట్లు కూడా ఎక్కువ. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో రెండు డిపోలు సాధ్యం కాదంటూ చెప్పే సాకులు వద్దని బాహటంగానే ప్రజలు విమర్శిస్తున్నారు.

ఉచిత ప్రయాణం..మహిళల నిలదీత : తెలంగాణ సరిహద్దులో ఉన్న చింతలపూడి నియోజకవర్గంలో మూడొంతులు గ్రామాలకు బస్సు సర్వీసులు లేవు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్త్రీ శక్తి ఉచిత ప్రయాణ పథకం సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా తెచ్చింది. బస్సులు లేని గ్రామాల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ఆశలు రేకెత్తిస్తున్నాయి. ఆ గ్రామాల్లో ఎప్పుడూ అడగని మహిళలు మా ఊరికి బస్సు ఏదీ.. అంటూ ఆ గ్రామాల పెద్దలు, నాయకులను నిలదీస్తున్నారు. ఇదిలా ఉంటే రాష్ట్ర సరిహద్దు మండలం కావడంతో అంతరాష్ట్ర సర్వీసుల పేరుతో పల్లెవెలుగు బస్సుల్లోను ఈ మండలంలో మహిళలకు ఉచిత ప్రయాణం అనుమతించడం లేదు. ఇది మహిళలకు మరింత ఆగ్రహాన్ని తెప్పిస్తోంది

15 ఏళ్లుగా బస్సు సర్వీసులు రద్దు చేశారు



ఆది సత్యనారాయణ, మాజీ సర్పంచ్, వెంకటాపురం

చింతలపూడి మండల కేంద్రంగా తెలంగాణ సరిహద్దులో ఉంటాయి. మూడొంతుల గ్రామాలకు బస్సు సర్వీసులు లేవు. గతంలో అనేక సర్వీసులు ఈ మార్గంలో నడిపి రద్దు చేశారు. పునరుద్ధరించలేదు. ఇప్పుడు ప్రజలకు ఉచిత పథకంతో మా గ్రామాలకు బస్సులు కావాలని అడుగుతున్నారు. వాటిని తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

డిపో ఆవశ్యకత ఉంది



ఆర్.వి.ఎస్.నారాయణ, సీపీఎం నేత, చింతలపూడి

చింతలపూడిలో 1978కి ముందు ఆర్టీసీ బస్సు డిపో పెట్టాలని ప్రజలు ఆశించారు. అప్పట్లో ఇవి వెనుకబడిన ప్రాంతమని ప్రచారం జరిపారు. కాని అప్పట్లోనే అభివృద్ధి ఉంది. ఇక్కడ సినిమా థియేటర్లు ఉండేవి. సినిమాలు చూడడానికి 40 కిలోమీటర్ల దూరం నుంచి వచ్చేవారు. పెళ్ళిళ్ళకు ఇక్కడే మార్కెట్ ఎక్కువ ఉండేది. రవాణ సౌకర్యం లేకపోవడం వల్ల ఇవన్నీ ఇప్పుడు వెనుకబడిపోయాయి.

రవాణ సౌకర్యాల్లో వెనుకంజ



ఆర్నేపల్లి అప్పారావు, మానవత నాయకుడు, చింతలపూడి

చింతలపూడి నియోజకవర్గంలో పలు గ్రామాలకు రవాణ సౌకర్యం లేక వెనుకబడి ఉన్నాయి. ఇప్పటికీ బాలువారిగూడెం, నామవరం, శివపురం వంటి మార్గాల్లో నడచి వస్తున్నారు. నియోజకవర్గంలో మారుమూల గ్రామాలకు బస్సులు నడపాలంటే చింతలపూడిలో డిపో ఏర్పాటు తప్పనిసరి.





కె.కోటలోని లలితాశ్రీ పీఠంలో అమ్మవారు.. మండలపర్రులో ఉమానీలకంఠేశ్వర పంచాయతన క్షేత్రం

నేటి నుంచి శరన్నవరాత్రులు

ఆలయాల్లో ఘనంగా ఏర్పాట్లు

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని అమ్మవారి ఆలయాల వద్ద ఈ నెల 22 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. దేవాలయాల పరిసరాలను శుభ్రపరిచి ముస్తాబు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా బారికేడ్లను ఏర్పాటు చేశారు. సామూహిక పూజలు, పారాయణలు నిర్వహించేందుకు ప్రత్యేక వేదికలను ఏర్పాటు చేశారు. అమ్మవారికి రోజుకో అలంకారం జరిపి భక్తులకు దర్శనమిచ్చేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సత్రంపాడులోని అంబికాదేవి, సౌభాగ్యలక్ష్మీదేవి, నగరంలోని మహిషాసురమర్దిని దేవి, బాల త్రిపుర సుందరిదేవి, జ్ఞాన సరస్వతిదేవి, కాశీ అన్నపూర్ణాదేవి, రాజ్యలక్ష్మీ దేవి, కనకదుర్గాంబ, కనకదుర్గమ్మ అమ్మవార్ల దేవాలయాలు పంచ రంగులతో శోభాయమానంగా ముస్తాబయ్యాయి.

● చింతలపూడి: ఆశ్వయుజ మాసం రావడంతో దేవి నవరాత్రులు సోమవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. చింతలపూడి కేంద్రంగా మెరకవీధిలో 13రోజుల పాటు ఈ ఉత్సవాలను నిర్వహించడానికి శిబిరాన్ని ఏర్పాటు చేశారు. దీంతో పాటు విశ్వనాథమఠం, వేగిలింగేశ్వరస్వామి, కనకదుర్గమ్మ, ప్రగడవరంలోని కనకదుర్గ ఆలయాల్లో ఉత్సవాలు ప్రారంభిస్తున్నారు. ఇవి కాకుండా కొన్ని గృహాల్లో దేవి పీఠాలు ప్రారంభించి పూజలు నిర్వహించడానికి విగ్రహాలు సిద్ధం చేసుకున్నారు.

● కామవరపుకోట: స్థానిక లక్ష్మీ హయగ్రీవ లలితాశ్రీ పీఠంలో సోమవారం నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని పీఠం వ్యవస్థాపకులు సుదర్శనం రామదుర్గ కుమాచారాచార్యులు (దుర్గబాబు), సత్య శ్రీనివాసాచార్యులు తెలిపారు. ఉత్సవాల్లో అమ్మవారికి రోజుకో అలంకారం జరిపి భక్తులకు దర్శనమిస్తామని సామూహిక పారాయణలు, కుంకుమార్చనలు నిత్యం నిర్వహిస్తామని తెలిపారు. వివిధ అలంకారాల్లో అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని పిలుపునిచ్చారు.

● నిడమర్రు: దసరా శరన్నవరాత్రి వేడుకలకు సర్వం సిద్ధం మయ్యాయి. పదిరోజుల పాటు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్న దసరా ఉత్సవాల నిర్వహణ మండలలో ప్రముఖ ఆలయాలన్నీ సిద్ధమయ్యాయి. పెదనింద్రకొలను భీమేశ్వరస్వామి ఆలయంలో చైర్మన్ మేకా వెంకటరమణ నేతృత్వంలో ఉత్సవాలకు సిద్ధమయ్యారు. మండలపర్రు ఉమానీలకంఠేశ్వర పంచాయతన క్షేత్రంలో ఉమాదేవి అమ్మవారికి దసరా సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఆలయ నిర్వహకులు సరిపల్లె శంకరం తెలిపారు. దసరా వేడుకల కోసం ఆలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.



నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్ నారాయణ



పెదపాడు శాఖా గ్రంథాలయంలో నివాళి దృశ్యం



టి.నరసాపురంలో నివాళులర్పిస్తున్న అ.ర.సం

గొప్ప సంఘ సంస్కర్త గురజాడ

జయంతి సందర్భంగా పలువురి నివాళి

ఏలూరుటూటౌన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): గొప్ప సంఘ సంస్కర్త మహాకవి గురజాడ అప్పారావు అని లైబ్రేరియన్ ఎ.నారాయణ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురజాడ అప్పారావు జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తితో కలిసి తెలుగు భాషాభివృద్ధికి గురజాడ విశేష కృషి చేశారని కొనియాడారు.

● పెదపాడు: పెదపాడు శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి దుగ్గిపోగు జాన్‌బాబు ఆధ్వర్యంలో సాంఘిక సంస్కర్త గురజాడ అప్పారావు జయంతి ఆదివారం ఘనంగా జరిగింది. తొలుత గురజాడ చిత్రపటానికి విద్యార్థులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాధికారి జాన్‌బాబు మాట్లాడుతూ గురజాడ తన రచనల ద్వారా సాంఘిక పరివర్తనకు ప్రయత్నించిన మహాకవి, తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప సాహితీకారులలో ఒకరన్నారు. 19వ శతాబ్దంలోనూ 20వ శతాబ్ది మొదటి దశకంలోనూ గురజాడ రచనలు మన్ననలు పొందుతున్నాయన్నారు.

● టి.నర్సాపురం:ప్రముఖ సాహితీవేత్తలు గురజాడ అప్పారావు, తాపీ ధర్మారావుల జయంతిని అ.ర.సం. ఏలూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక శాఖ గ్రంథాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పురం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అ.ర.సం. రాష్ట్ర కార్యదర్శి పి.ఎస్.సాగర్ మాట్లాడుతూ సమకాలీన పరిస్థితుల్లో గురజాడ, తాపీ ధర్మారావుల రచనలను బావితరాలకు అందించాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. ప్రముఖ జానపద కళాకారులు వీరమళ్ల సత్యనారాయణ, లలిత గేయాలు ఆలపించారు. గ్రంథపాలకులు ఆర్.రత్నకిశోర్, వందన సమర్పణ చేశారు. ప్రజానాట్య మండలి ఏలూరు జిల్లా సీనియర్ నాయకులు టి.వి.ఎస్.రాజు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నేత పాలేటి పాండురంగారావు, సాహితీ స్రవంతి నేత సింగంశెట్టి సూర్యకుమార్ పాల్గొన్నారు.

● కామవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురజాడ జయంతిని నిర్వహించారు. గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కె.విజయబాబు, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు, ఏపీ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ కె.రత్నశేఖర్, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ జి.శ్రీనివాసరావు, అధ్యాపకులు ఎం.ఉషారాణి, కె.ఇందిరాకుమారి, దారావత్ మల్లేశ్, ఎం.విజయకృష్ణ, వి.రాజు పాల్గొన్నారు.





ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని, ఏలూరు ఎమ్మెల్యే చంటి

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

పెదవేగి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనులు చేస్తున్నామని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో ఆదివారం పలువురు ప్రజలు వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ వినతులు అందించారు. అందరి సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐదేళ్ల రాక్షస పాలన నీడ నుంచి బయటకు వచ్చిన రాష్ట్రం ఇప్పుడిప్పుడే కోలుకుంటుందన్నారు. వైసీపీ పాలనలో ఎక్కడ చూసినా అరాచకాలు, అకృత్యాలే కనిపించేవని, ఇప్పుడు ఎటువంటి ఆందోళనలు లేకుండా ప్రజలు ప్రశాంతమైన జీవనం గడుపుతున్నారని ఆయన చెప్పారు. అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న రాష్ట్రం.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో తిరిగి గాడిన పడిందన్నారు. సంక్షోభం అనే మాటకు తావులేకుండా సంక్షేమం దిశగా రాష్ట్రం ముందుకెళ్తుందని, ప్రజలకు అంతా మంచే జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నల్లజర్ల విశాల సహకార పరపతి సంఘం చైర్ పర్సన్‌గా రావూరి వెంకటరమణ బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, జడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌లు రావూరి వెంకటరమణకు శుభాకాంక్షలు తెలిపారు.

అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే చంటి..

ఏలూరుటూటౌన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల మేరకు సూపర్ 6 హామీలు పూర్తి స్థాయిలో అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ఆదివారాలు సెలవులు, పండుగలని లేకుండా సమస్యలున్నవారు ఎప్పుడైన వచ్చి తనను కలవవచ్చన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు.



నగదు అందజేస్తున్న టీడీపీ నాయకులు

టీడీపీ నాయకుల ఆర్థిక సాయం

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న సాటి మనిషిని ఆదుకోవడం ఎంతో సంతోషాన్ని ఇస్తుందని టీడీపీ నాయకుడు బూరుగుపల్లి సూరిబాబు అన్నారు. కిడ్నీ వ్యాధితో బాధ పడుతూ రాజమండ్రిలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గడ్డం ప్రసాద్‌ను టీడీపీ నాయకులు పరామర్శించి భరోసా కల్పించారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. టీడీపీ నాయకులు కాకర్ల కృష్ణ కిషోర్, బూరుగుపల్లి సూరిబాబు చేతుల మీదుగా రూ.50 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈర్ని సూరిబాబు, యడ్లపల్లి ఏడుకొండలు, సింహాద్రి వరలక్ష్మి, కొవ్వలి విజయ పాల్గొన్నారు.

గోతుల రోడ్డుకు మరమ్మతులు



చత్రు సరిచేస్తున్న దృశ్యం

నిడమర్రు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): అధ్వానంగా ఉన్న రహదారి మరమ్మతులకు రైతులు నడుంబిగించారు. గణపవరం నుంచి ఆకివీడు వెళ్లే రోడ్డు క్రొవ్విడి గ్రామ శివారులో పూర్తిగా ధ్వంసమైంది. లారీలు, ఆటోలు రాకపోకలు సాగించలేకపోతున్నాయి. దీంతో ఆక్వా రైతులు, స్థానికులు ఎమ్మెల్యే ధర్మరాజు దృష్టికి తీసుకొచ్చారు. ఆయన సూచనల మేరకు క్రొవ్విడి జనసేన పార్టీ గ్రామాధ్యక్షులు వాకమూడి ఇంద్రకుమార్, టీడీపీ అధ్యక్షుడు సారికె లెనిన్ బాబు ఆధ్వర్యంలో రైతులు మరమ్మతులు చేపట్టారు. శనివారం 10 లారీల కంకర సత్రు దింపి రోడ్డుపై సర్దించారు.



కేక్ కట్ చేస్తున్న నాయకులు

టీడీపీ నేతలకు అభినందన సభ

లింగపాలెం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ఇటీవల నామినేటెడ్ పదవులను స్వీకరించిన పీఏసీఎస్ చైర్మన్ మోరంపూడి మల్లికార్జునరావు, రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ పల్లి శ్రీనివాసరావులను కల్యాణంపాడు ఎస్సీసెల్ నాయకులు ఘనంగా సన్మానించారు. అసిలేటి అజయ్, పొదిల శౌరి, తాతిన రాధాకృష్ణ, సర్పంచ్ బొంతు రాంబాబు, బొంతు శ్రీను, చెన్ను శ్రీనివాస్ యాదవ్, తొమ్మండ్రు మల్లయ్య, అసిలేటి కిరణ్, అశోక్, రాజేశ్వరరావు, రాజరత్నం పాల్గొన్నారు.

గన్నికి ఏఎస్పీ శుభాకాంక్షలు



గన్నికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఏఎస్పీ

భీమడోలు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయుల్ని ఏలూరు అడిషనల్ సూపరింటెండెంట్ పోలీసు నక్కా సూర్య చంద్రరావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆప్కాబ్ అవార్డు అందుకున్న సందర్భంగా భీమడోలులోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం గన్నిని కలిసి ఏఎస్పీ పుష్పగుచ్ఛం శుభాకాంక్షలు తెలిపారు.

కూరగాయల పంపిణీ

కుక్కునూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): కొత్త లంకాలపల్లి గిరిజనులకు బీజేపీ నాయకులు వాడపల్లి లక్ష్మణాచార్యులు ఆధ్వర్యంలో ఆదివారం కూరగాయలు పంపిణీ చేశారు.అక్టోబరు 2న ప్రధాని మోదీ పుట్టిన రోజు సందర్భంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. దాదాపు 50 మందికి కూరగాయలు పంపిణీ చేశారు.

శాంతిని పెంపొందించుకోవాలి

ఏలూరు క్రైం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రపంచ దేశాల మధ్య శాంతియుత వాతావరణం పెంపొందించేలా ప్రతి ఏటా సెప్టెంబర్ 21న ప్రపంచ శాంతి దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ అన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, మానవత సంస్థల ఆధ్వర్యంలో అంతర్జాతీయ శాంతి దినోత్సవ వేడుకలను ఏలూరులోని ప్రభుత్వాసుపత్రి ఆవరణలో ఉన్న రెడ్‌క్రాస్ భవనం వద్ద నిర్వహించారు. శాంతి ర్యాలీని ఏలూరు డీఎస్పీ డి శ్రావణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ ర్యాలీ రెడ్ క్రాస్ భవనం నుంచి ఫైర్‌స్టేషన్ వరకూ నిర్వహించారు. డీఎస్పీ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ శాంతి ద్వారానే ప్రపంచ ప్రగతి పెంపొందుతుందన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థలు

జిల్లా రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ జె.సత్యనారాయణరాజు మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి ప్రపంచ దేశాల మధ్య యుద్ధాలు హింసను నివారించేలా శాంతిని పెంపొందిస్తుందన్నారు. రెడ్ క్రాస్ కార్యదర్శి బెన్నీ, రెడ్‌క్రాస్ కమిటీ సభ్యులు చంద్రశేఖర్, ఎంవివిఎస్ నాగేశ్వరరావు, ఎం.అజయ్‌బాబు, మానవత సభ్యులు నిర్మల, ఉత్తమ దుర్గ, మోహినీ, రత్నాకరరావు, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.



నియామకపత్రాలు అందజేస్తున్న కరస్పాండెంట్

సీఆర్ఆర్ ఫార్మసీ విద్యార్థులకు ఉద్యోగాలు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఫార్మా కంపెనీల్లో మెడికల్ కోడింగ్ ఉద్యోగాల భర్తీకి ఆదివారం క్లౌడ్స్ అండ్ క్లౌడ్స్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో సీఆర్ఆర్ ఫార్మసీ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. తమ కళాశాలకు చెందిన బి.ఫార్మసీ ఫైనలియర్ అవుట్ గోయింగ్ బ్యాచ్ విద్యార్థులు ఐదుగురు ఎంపికయ్యారని కళాశాల కరస్పాండెంట్ చలసాని విశ్వనాథరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్రబాబు తెలిపారు. టెక్ మహీంద్ర సంస్థలో బి.జానవిశ్రీ సత్య అంజన, ఏజీఎస్ హెల్త్ కేర్‌లో కావ్యశ్రీ, చిరోక్ హెల్త్ ఇండియా సంస్థలో పి.రాహుల్, ఎన్.ఉదయ్‌కుమార్, ఎం.వంశీకుమార్‌లు ఉద్యోగాలు సాధించారని వివరించారు. త్వరలో బహుళజాతి సంస్థ (ఎంఎన్‌సీ)ల ఫార్మాకంపెనీలు క్యాంపస్ సెలక్షన్లకు కళాశాలకు రానున్నాయని వెల్లడించారు.100మందికిపైగా విద్యార్థులు తమ కళాశాల నుంచి ప్లేస్‌మెంట్‌లు పొందారని, ఈ మేరకు నియామకపత్రాలు అందజేశామన్నారు.

ప్రపంచ అల్జీమర్స్ డే

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): దొండపాడులోని ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం వారు చాటపర్రు పీహెచ్‌సీలో ఆదివారం ప్రపంచ అల్జీమర్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వక్తలు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ కమిటీ ఎన్నిక

కుక్కునూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఏఐఎస్ఎఫ్ నూతన మండల కమిటీ ఎన్నిక ఆదివారం కుక్కునూరులో జరిగింది. మండల కార్యదర్శిగా సారంగి శౌర్య, అధ్యక్షుడిగా చినేని క్రాంతి చైతన్యతో పాటు 9మంది సభ్యులతో కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులు చరణ్, బన్నీ, మణికంఠ, మనోజ్ తదితరులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కొన్నే లక్ష్మయ్య ఉన్నారు.

రాట్నాలమ్మకు పూజలు

పెదవేగి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): రాట్నాలకుంట శ్రీరాట్నాలమ్మకు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి పాలపొంగలిని నైవేద్యంగా సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. అమావాస్య, ఆదివారం కావడంతో ఆ ప్రభావం అమ్మవారి దర్శనాలపై పడింది. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య తగ్గింది. ఆలయ అర్చకులు పావులూరి వీరవెంకట రామసత్యనారాయణశర్మ, రుద్రపాక మోహన దుర్గా శేషగిరిరావు, పావులూరి పూర్ణయ్య శర్మ, చావలి సాయి అమ్మవారికి లలితా సహస్ర నామ దేవీ ఖడ్గమాలార్చన పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశామని ఈవో సతీశ్ కుమార్ తెలిపారు.

ఘనంగా మహాలయ అమావాస్య

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): సత్రంపాడులోని శ్రీలక్ష్మీగణపతి స్వామి ఆలయంలో ఆదివారం మహాలయ అమావాస్య సందర్భంగా భక్తులకు స్వామికి గుమ్మడికాయలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గరికతో అర్చన జరిపి బెల్లం నివేదనలు సమర్పించారు. ఆలయ అర్చకులు రెండుచింతల రాఘవేంద్రశర్మ భక్తులతో వారి గోత్రనామాలతో అర్చనలు జరిపారు.ఆలయ ఈవో సి.హెచ్.చిన నాగేశ్వరరావు, సిబ్బంది భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు. ఆలయ హుండీలను ఏలూరు డివిజన్ తనిఖీదారు సి.హెచ్.ఉదయ్‌బాబు నాయుడు పర్యవేక్షణలో 42 రోజులకుగాను లెక్కించగా ఒక లక్షా 47 వేల 519 రూపాయలు, పది కెనడ డాలర్లు వచ్చినట్టు ఈవో చిననాగేశ్వరరావు తెలిపారు.

ఆయుష్ వైద్య శిబిరం

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆహారపు అలవాట్లు, జీవనశైలిలో ఆరోగ్య జాగ్రత్తలు యుక్త వయస్సు నుంచే అలవర్చుకోవాలని ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కోయ హరికృష్ణ సూచించారు. ఏలూరు ఆయుష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం జడ్పీ హైస్కూల్లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో స్థానికులకు గుండె జబ్బులు, రుమాటిక్ ఆర్థరైటిస్, కిడ్నీ సంబందిత వ్యాదులు, జీర్ణకోశ జబ్బులు, అల్సర్లు, ఊపిరితిత్తుల సమస్యలకు సంబందించిన వైద్యపరీక్షలను ఉచితంగా చేసి, వైద్య సలహాలను అందించారు. ఆసుపత్రి మేనేజర్ కాశీనాథ్ జాస్తి మాట్లాడుతూ సంఘ సేవకులు పర్వతనేని రామకృష్ణ అభ్యర్థన మేరకు వైద్య శిబిరం నిర్వహించామన్నారు.

171 మందికి నేత్ర పరీక్షలు

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక అగ్రహారంలోని రామకోటి ప్రాంగణంలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మానేపల్లి రామారావు ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో వేమగిరికి చెందిన పరమహంస యోగానంద నేత్రవైద్యశాల నిపుణులు 171 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలు ఇచ్చారు. శిబిరానికి విచ్చేసిన వారికి భోజనాలు ఏర్పాటు చేశారు. స్థానికులు బొలిశెట్టి సురేష్ కుమార్, పిల్లి పండరీనాథ్, తవ్వా అజయ్‌కుమార్‌లు సేవలందించారు.

క్యాన్సర్‌పై అవగాహన

లింగపాలెం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): రంగా పురంలో డాక్టర్ భాగ్యశ్రీ, హోమియోపతి డాక్టర్ ఎస్. మాధవీల ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన శిబిరం నిర్వహించారు. ముందస్తు గుర్తింపుతోనే క్యాన్సర్ నిర్మూలనకు దోహదపడుతుందన్నారు. క్యాన్సర్ నిర్ధారణ స్క్రీనింగ్ పరీక్షలతోనే సాధ్యపడుతుందన్నారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.



భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డిస్తున్న రెడ్డి అప్పలనాయుడు

గంగానమ్మ సంబరాల్లో అన్నదానం

ఏలూరుకార్పొరేషన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక గణేష్ నగర్‌లోని గంగానమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఆదివారం సంబర మహోత్సవం జరిగిన నేపథ్యంలో భక్తులకు ఆలయ నిర్వాహకులు మహా అన్నప్రసాద వితరణను ఏర్పాటు చేయగా ఈ కార్యక్రమాన్ని ఏపీఎస్ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని అన్నప్రసాద వితరణలో పాల్గొన్నారు. నాయకులు ఆకుల శ్రీనివాస్, గూండాల దుర్గారావు, అమ్మవారి ఉత్సవాల కమిటీ సభ్యులు ధర్మవరపు భారతమ్మ, కొత్తకోట బుజ్జి, రమాదేవి, పర్సా రాంకుమార్, చంద్ర, కర్ర తవిటిరాజా, కాగితాల రాంబాబు, నల్లా గణేష్, ఉప్పాడ శ్రీను, కిరణ్, సంజీవ్ పాల్గొన్నారు.

గురజాడకు ఘన నివాళి

కలిదిండి, సెప్టెంబరు 21 (ఆంధ్ర జ్యోతి): కలిదిండి శాఖా గ్రంథాలయంలో ఆదివారం గురజాడ అప్పారావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి జె.రమేష్ బాబు మాట్లాడుతూ బాల్య వివాహాలు, వరకట్న నిర్మూలనకు కృషి చేసిన గురజాడ చిరస్మరణీయుడని కొనియాడారు. పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బావాజీ మఠంలో మహాలయ అమావాస్య పూజలు

ముదినేపల్లి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మహాలయ అమావాస్య పూజలను ఆదివారం ముదినేపల్లి మండలం సింగరాయపాలెం బావాజీ మఠంలో ఘనంగా నిర్వహించారు. మఠం ఆచార సంప్రదాయాల ప్రకారం బంజారీల ఆదిగురువు సంత్ సేవాదాస్ మహరాజ్, గురు జగ్‌మల్‌దాస్ మహరాజ్‌లకు ఈవో కొండలరావు ఆధ్వర్యంలో బంజారీ భక్త సమాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ రాములు నాయక్, కార్యదర్శి వెంకటేశ్వరరావు నాయక్ అభిషేకాలు, పూజలు నిర్వహించారు. పితృపర్వ కార్యక్రమాలు నిర్వహించారు.



వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

ముసునూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపవరం వైసీపీ ఎంపీటీసీతో పాటు ముఖ్య నాయకులు, కార్యకర్తలు గ్రామ టీడీపీ అధ్యక్షుడు ఉప్పలపాటి గణేష్ ఆధ్వర్యంలో ఆదివారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు గద్దె రఘుబాబు, గణేష్ ఎంపీటీసీ కొండ్రుపాటి వెంకమ్మ, ముఖ్య నాయకులు తిరువీధుల అజయ్, జల ప్రకాశం, టి.మురళీ తోపాటు మరో 42 మంది వైసీపీ కార్యకర్తలకు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ, నాయకులు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో కూటమి పాలనకు, మంత్రి పార్థసారథి పనితీరుకు ఆకర్షితులమై టీడీపీలో చేరినట్లు వారు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

అవార్డు గ్రహీత దేవానంద్‌కు సత్కారం



మండవల్లి, సెప్టెం బరు 21 (ఆంధ్ర జ్యోతి): జాతీయ స్థాయిలో ఉత్తమ అధ్యాపకుడిగా అవార్డు అందుకున్న డాక్టర్ మెండా దేవానంద్ కుమార్‌ను మండవల్లిలో ఆదివారం ఘనంగా సత్కరించారు. మైలవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా పనిచేస్తున్న ఆయన జాతీయస్థాయిలో ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపికై ఈ నెల 5న రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు తీసుకోవడంతో మండవల్లిలో ఆదివారం అభినందన సభ ఏర్పాటుచేసి ఆయనను సత్కరించారు. సర్పంచ్ మెండా ఝాన్సీ, చేబోయిన వీర్రాజు, డాక్టర్ సుధాబత్తుల విజయ్‌కుమార్, కూనపురెడ్డి కోటేశ్వరరావు, ముళ్లపూడి సత్తిబాబు, గుమ్మడి వెంకటేశ్వరరావు, బొమ్మనబోయిన గోకర్ణ పాల్గొన్నారు.

నిండు జీవితం నిలబడింది

4 నెలల క్రితం మహిళ ఆత్మహత్యాయత్నం..

సకాలంలో స్పందించి కాపాడిన శక్తి టీం

తాజా డీఎస్సీలో టీచర్ ఉద్యోగం సాధించిన మహిళ

ఏలూరు క్రైం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మానసిక ఒత్తిడితో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళను ఏలూరు శక్తి టీమ్ పోలీసు లు సకాలంలో కాపాడి ఆమె ప్రాణాలను నాడు నిలిపారు. పోలీసుల కౌన్సెలింగ్‌తో ఆమె జీవితంలో ముందడుగు వేసింది. మెగా డీఎస్సీలో నేడు ఉద్యోగం సాధించింది. కృష్ణాజిల్లాకు చెందిన యువతి పదో తరగతి వరకు చదివి ఆర్థిక పరిస్థితుల కారణంగా చదువు మానేసింది. ఏలూరులో అమ్మమ్మ ఇం టికి తరచుగా రావడంతో ఆ ఇంటి పక్కనే యువకుడితో పరిచయం పెళ్లికి దారి తీసింది. తర్వాత ప్రైవేటుగా ఇంటర్మీడియట్, డిగ్రీ, ఎంఏ, బీఈడీ చదివింది. ప్రైవేటు టీచరుగా పనిచేస్తూ ఇద్దరు పిల్లలను పోషించుకుంటుంది. అంతలో ఆమె జీవితంలో భారీ కుదుపు. భర్త వ్యసనాలకు బానిస కావడంతో తరచు గొడవలు. అతడి వేధింపులు భరించలేక 2024లో కోర్టు నుంచి విడాకులు కూడా తీసుకుంది. తర్వాత స్నేహితురాలి సూచనతో విడాకులు తీసుకున్న భర్తతో సర్దుబాటు చేసు కుంది. తిరిగి పిల్లలు, భర్తతో ఏలూరులోనే నివాసం ఉన్నారు. తర్వాత కొన్నాళ్లకు భర్త వేధింపులు యథాతథం కావడంతో చనిపోవాలనుకుంది. గడచిన మే 23న ఏలూరు ఎన్ఆర్‌పేట వద్ద రైలు పట్టాలపై నిల బడింది. స్థానికులు గమనించి వెంటనే 112కు కాల్ చేశారు. వెంటనే స్పందించిన మహిళా పోలీస్ స్టేషన్ సీఐ, శక్తి టీమ్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు, మహిళా కానిస్టేబుళ్లు సుజాత, శ్రావణి, సిబ్బంది కలిసి రైలు పట్టాల నుంచి ఆమెను పక్కకు లాగారు. ఆ మరుక్షణం రైలు దూసుకుపోయింది. ఒక్కక్షణం ఆలస్యమైనా ప్రాణాలు కోల్పోయేది. పోలీ సులు ఆమెతో పాటు ఆమె భర్తను కూడా పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రభుత్వం ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి మెగా డీఎస్సీ ప్రకటించ డంతో ఆమె జీవితం మలుపు తిరిగింది. పట్టుదలతో చదివి డీఎస్సీలో విజయం సాధించి ఓపెన్ క్యాటగిరిలో స్కూలు అసిస్టెంట్‌గా ఎంపి కైంది. తనువు చాలించాలని నిర్ణయించుకున్నా.. ఒత్తిడి, కష్టాలను అధిగమించి జీవితంలో గెలిచిన ఆమెను మహిళా పోలీసుల మళ్లీ పిలిచారు. మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం.సుబ్బారావు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు.

వైద్యం వికటించి యువకుడి మృతి

విజయవాడ ఆస్పత్రి వద్ద మృతుడి బంధువుల ఆందోళన

పరిహారం చెల్లిస్తామనడంతో ఆందోళన విరమణ

చాట్రాయి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి) మండలంలోని పర్వతాపురం గ్రామానికి చెందిన చొప్పరపు రాజేష్ (25) విజయవాడ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వైద్యం వికటించి ఆదివారం మృతి చెందాడు. దీంతో మృతుడి బంధువులు, పలువురు గ్రామస్థులు ఆస్పత్రి వద్ద ఆందోళన చేపట్టారు. మృతుడి కుటుంబీకుల వివరాల ప్రకారం రాజేష్ చెట్టు నరికే పనికి వెళ్ళగా దెబ్బతగిలి, కాలి నరం కట్ అయ్యింది. దీంతో గత ఆదివారం విజయవాడ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చగా సర్జరీ చేశారు. తరువాత కాలికి ఇన్‌ఫెక్షన్ సోకింది కాలు తీసేయాలని డాక్టర్లు చెప్పటంతో, కాలు పోయినా మనిషి దక్కితే చాలు అని కుటుంబీకులు కాలు తీసివేయటానికి అంగీకరించారు. తమ అర ఎకరం భూమి అమ్మి రూ. 10 లక్షలు ఆస్పత్రికి చెల్లించామని అయినా తన భర్తను చంపేశారని, తనకు, తన పిల్లలకు దిక్కెవరంటూ మృతుడి భార్య వెంకటేశ్వరమ్మ విలపించింది. సుమారు ఐదున్నర గంటల ఆందోళన అనంతరం ఆస్పత్రి యాజమాన్యం వారిని చర్చలకు పిలిచింది. పర్వతాపురం సర్పంచ్ మిద్దె శివాజీ, కూటమి నాయకులు మిద్దె సత్యనారాయణ, బొర్రా నాగేశ్వరరావు, బూబత్తుల చెన్నారావు ఆస్పత్రి యాజమాన్యంతో చర్చలు జరపగా రూ. 4 లక్షలు పరిహారం, ఆస్పత్రికి కట్టిన సొమ్ము ఇవ్వటానికి యాజమాన్యం అంగీకరించటంతో ఆందోళన విరమించారు.

పాము కాటుతో మహిళ మృతి

చాట్రాయి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నంపేట గ్రామంలో ఆదివారం తేళ్ళూరి జయచింత (45) అనే మహిళ పాముకాటుకు గురై మృతి చెందింది. పర్వతాపురం బీరతోటలో కూలి పనికి వెళ్ళిన ఆమెను పాము కాటు వేసింది. వెంటనే ఆమెను చాట్రాయి పీహెచ్‌సీకి తీసుకువెళ్లి ప్రథమ చికిత్స తరువాత నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు గ్రామస్థులు తెలిపారు. మృతురాలికి భర్త, కుమార్తె, కుమారుడు ఉన్నారు. జయచింత భౌతికకాయానికి టీడీపీ లీగల్ సెల్ జిల్లా కార్యదర్శి అత్తులూరి శ్రీనివాసరావు, కూటమి నాయకులు శ్రద్ధాంజలి ఘటించి కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కోడి పుంజుల చోరీ

చాట్రాయి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని జనార్దనవరం దళితవాడలో శనివారం రాత్రి దారా చంద్రమోహన్ పెరట్లో ఉన్న రెండు కోడిపుంజులు చోరీ అయ్యాయి. వీటి విలువ రూ. 30 వేలు ఉంటుందని, చోరీపై చాట్రాయి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు బాధితుడు తెలిపాడు. ఇటీవల గ్రామాల్లో పుంజుల దొంగతనాలు ఎక్కువయ్యాయని, పోలీసులు దొంగలను పట్టుకోవాలని పలువురు కోరుతున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140, 149, 160
చికెన్ విత్ స్కిన్	268
చికెన్ స్కిన్‌లెస్	278
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	



విద్యుద్దీపాలతో మిరుమిట్లుగొల్పుతున్న కొల్లేటికోట పెద్దింటమ్మ ఆలయం



విద్యుత్ వెలుగుల్లో నూజివీడు కోట మహిషాసుర మర్దిని ఆలయం



బలివేలోని రాజరాజేశ్వరి అమ్మవారు

నేటి నుంచి శరన్నవరాత్రులు

» ముస్తాబైన ఆలయాలు, మండపాలు » రోజుకో అవతారంలో సాక్షాత్కరించనున్న జగన్మాత

కైకలూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రులకు ఆలయాలు ముస్తాబయ్యాయి. మండలంలోని ఆటపాక, గోనెపాడు, చటాకాయ్, వదర్లపాడు, వరహాపట్నం, ఆలపాడు తదితర గ్రామాల్లో పందిళ్ళు ఏర్పాటుచేసి దుర్గమ్మ విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. కొల్లేటికోట పెద్దింటి అమ్మవారి ఆల యంలో ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి రోజూ అమ్మవారికి ఉభయదాతల ఆధ్వర్యంలో విశేషపూజలను నిర్వహించనున్నారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. అలాగే కైకలూరు శ్రీశ్యామలాంబ ఆలయంలో దసరా ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేశారు. సోమవారం ఉదయం 9.20 గంటలకు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఉత్సవా లను ప్రారంభిస్తారు. బందా వంశీకుల ఆధ్వ ర్యంలో కలశ స్థాపన, అఖండ దీపారాధన జరగనుంది.

ముదినేపల్లి: దేవపూడిలోని శ్రీ విజయ దుర్గాదేవి సమేత హిమగిరి రామలింగేశ్వరస్వామి ఆలయంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. నిత్యం అమ్మవారికి విశేష అలంకరణతోపాటు ఈ నెల 26న లక్ష కుంకుమార్చన, 29న సరస్వతీదేవి పూజ, అక్టోబరు 2న శమీ పూజ, 3న రథోత్సవం, 4న అఖండ అన్న సమారాధన జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ దాసరి భగవాన్ దాస్ తెలిపారు. ప్రతి రోజూ చండీ యాగం నిర్వహించనున్నట్టు ప్రధాన అర్చకుడు జగదీశ్వర మణికంఠ తెలిపారు.

నూజివీడు టౌన్: ఆంధ్రా మైసూరుగా పేరు గాంచిన నూజివీడు కోటమహిషాసుర మర్దిని ఆలయంలో దసరా ఉత్సవాలను సోమవారం నుంచి 2వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు దేవదాయ ధర్మదాయశాఖ ఈవో అలివేణిశ్రీ తెలిపారు. సోమవారం అమ్మవారు బాల త్రిపురసుందరిగా మంగళవారం గాయత్రీదేవిగా, బుధవారం అన్నపూర్ణాదేవిగా, గురువారం కాత్యాయినిగా, శుక్రవారం మహాలక్ష్మిగా, శనివారం లలితాత్రిపురసుందరిగా, ఆదివారం మహాచండీదేవిగా, 29వ తేదీ సోమవారం సరస్వతిదేవిగా, 30వ తేదీ దుర్గాదేవిగా, 1న మహి షాసురమర్దినిగా, 2న రాజరాజేశ్వరిగా దర్శనమిస్తారన్నారు.

ఆగిరిపల్లి: స్థానిక రుద్రభూమి వద్ద గల దుర్గమ్మ ఆలయం ముస్తాబైంది. సోమవారం నుంచి అమ్మవారు పలు అలంకర ణల్లో దర్శనమి స్తారని ఆలయ ఈవో సాయి తెలిపారు. ప్రతిరోజు ఆలయంలో కుంకుమార్చన, చండీ హోమం నిర్వహి స్తామని ఆలయ అర్చకుడు శ్రీనివాస్ మూర్తి తెలిపారు. విజయదశమి రోజున ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్టు తెలిపారు.

కలిదిండి: మండలంలో సంతోషపురం, మూల్లంక, గుర్వాయిపాలెంలో దుర్గమ్మ ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. కలిదిండిలో పలు చోట్ల మండపాలు ఏర్పాటు చేసి దుర్గమ్మ విగ్రహాలను ప్రతి ష్ఠించారు. కోరుకొల్లులో సర్పంచ్ బట్టు లీలా కనకదుర్గ ఆధ్వర్యంలో దుర్గమ్మ ఆలయానికి వెళ్లే రహ దారి ఇరు వైపులా ఉన్న ముళ్ల పొదలు తొలగించి పారిశుధ్య పనులు చేపట్టారు.

ముసునూరు: బలివే శ్రీ రాజరాజేశ్వరి ఆలయం, ముసునూరులో శ్రీ వేంకటాచలస్వామి ఆలయం, గోగులంపాడు, చెక్కపల్లి గ్రామాల్లోని కోదండ రామాలయాల్లో శరన్నవరాత్రులు జరుగుతాయని ఆలయ కమిటీలు తెలిపాయి. పలు గ్రామాల్లో మండపాలను ఏర్పాటుచేసి సుందరంగా అలంకరించారు. కోలాటాలు, భజనలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

కల సాకారం అయ్యేనా!

(5వ పేజీ తరువాయి)

వారే. మహిళల ఓట్లు కూడా ఎక్కువ. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో రెండు డిపోలు సాధ్యం కాదంటూ చెప్పే సాకులు వద్దని బాహాటం గానే ప్రజలు విమర్శిస్తున్నారు.

ఉచిత ప్రయాణం.. మహిళల నిలదీత

తెలంగాణ సరిహద్దులో ఉన్న చింతలపూడి నియోజకవర్గంలో మూడొంతులు గ్రామాలకు బస్సు సర్వీసులు లేవు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్త్రీ శక్తి ఉచిత ప్రయాణ పథకం తెచ్చింది. బస్సులు లేని గ్రామాల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ఆశలు రేకెత్తిస్తున్నాయి. ఆ గ్రామాల్లో మహిళలు మా ఊరికి బస్సు ఏదీ.. అంటూ ఆ గ్రామాల పెద్దలు, నాయకులను నిలదీస్తున్నారు. ఇదిలా ఉంటే రాష్ట్ర సరిహద్దు మండలం కావడంతో అంతరాష్ట్ర సర్వీసుల పేరుతో పల్లెవెలుగు బస్సుల్లోను ఈ మండలంలో మహిళలకు ఉచిత ప్రయాణం అనుమతించడం లేదు. ఇది మహిళలకు మరింత ఆగ్రహాన్ని తెప్పిస్తోంది.



15 ఏళ్లుగా బస్సు సర్వీసులు రద్దు చేశారు

ఆది సత్యనారాయణ, మాజీ సర్పంచ్, వెంకటాపురం

చింతలపూడి మండల కేంద్రంగా తెలంగాణ సరిహద్దులో ఉంటాయి. మూడొంతుల గ్రామాలకు బస్సు సర్వీసులు లేవు. గతంలో అనేక సర్వీసులు ఈ మార్గంలో నడిపి రద్దు చేశారు. పునరుద్ధరించలేదు. ఇప్పుడు ప్రజలకు ఉచిత పథకంతో మా గ్రామాలకు బస్సులు కావాలని అడుగుతున్నారు. వాటిని తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

డిపో ఆవశ్యకత ఉంది

ఆర్.వి.ఎస్.నారాయణ, సీపీఎం నేత, చింతలపూడి



చింతలపూడిలో 1978కి ముందు ఆర్టీసీ బస్సు డిపో పెట్టాలని ప్రజలు ఆశించారు. అప్పట్లో ఇది వెనుకబడిన ప్రాంతమని ప్రచారం జరిపారు. కాని అప్పట్లోనే అభివృద్ధి ఉంది. ఇక్కడ సినిమా థియేటర్లు ఉండేవి. సినిమాలు చూడడానికి 40 కిలోమీటర్ల దూరం నుంచి వచ్చేవారు. పెళ్ళిళ్ళకు ఇక్కడే మార్కెట్ ఎక్కువ ఉండేది. రవాణ సౌకర్యం లేకపోవడం వల్ల ఇవన్నీ ఇప్పుడు వెనుకబడిపోయాయి.



రవాణా సౌకర్యాల్లో వెనుకంజ

ఆర్నేపల్లి అప్పారావు, మానవత నాయకుడు, చింతలపూడి

చింతలపూడి నియోజకవర్గంలో పలు గ్రామాలకు రవాణ సౌకర్యం లేక వెనుకబడి ఉన్నాయి. ఇప్పటికీ బాలువారిగూడెం, నామవరం, శివపురం వంటి మార్గాల్లో నడచి వస్తున్నారు. నియోజకవర్గంలో మారుమూల గ్రామాలకు బస్సులు నడపాలంటే చింతలపూడిలో డిపో ఏర్పాటు తప్పరిసరి.

'మానవత' చేయూత

మండవల్లి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని గన్నవరంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సలహాదారు ప్రొఫెసర్ సుదాబత్తుల విజయకుమార్, మండవల్లి మండల అధ్యక్షుడు కూనపురెడ్డి వెంకట బాల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదానికి గురై జీవనోపాధి కోల్పోయిన కూనపురెడ్డి పాండురంగ అనే నిరుపేద కుటుంబానికి నిత్యావసర సరుకులు, రూ.7 వేలు ఆర్థికసాయాన్ని ఆదివారం అందజేశారు. మండవల్లి మానవత సేవా సంస్థ తరపున నిత్యావసర సరుకులు, రూ.5 వేలు, గ్రామస్థుడు గాది వెంకటేశ్వరరావు రూ. 2 వేలు విరాళం కలిపి రూ.7 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు.

మార్కెట్ జోష్!

(5వ పేజీ తరువాయి)

రెవెన్యూ, గ్రామసచివాలయాల ఉద్యోగులతో కలిసి ప్రజల్లోకి వెళ్లనున్నారు. ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చేపట్టిన చొరవతోనే జీఎస్టీ ధరాభారం తగ్గిందనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఏలూరు నగరంలో సోమవారం ఉదయం 10 గంటలకు పెద్ద పోస్టాఫీస్ నుంచి కుండీ సెంటర్ మీదుగా గడియార స్తంభం, మెయిన్‌బజార్, చందనా బ్రదర్స్ వరకు బీజేపీ నాయకులు కూటమి నేతలు, కార్యకర్తలతో కలిసి ప్రదర్శన నిర్వహించనున్నారు.



సుప్రియను సన్మానించిన మంత్రి నిమ్మల

చెస్ క్రీడాకారిణి సుప్రియకు మంత్రి సత్కారం

ముసునూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాట్రేనిపాడుకు చెందిన పొట్లూరి గణేష్‌బాబు కుమార్తె, అంతర్జాతీయ చెస్ క్రీడాకారిణి సుప్రియను విజయవాడలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సన్మానించారు. ఇటీవల ఆస్ట్రేలియాలో జరిగిన చెస్ పోటీల్లో సుప్రియ బంగారు పతకాన్ని సాధించడం గర్వకారణమని మంత్రి నిమ్మల సుప్రియను, కోచ్ బొబ్బ వీర రాఘవరావును అభినందించారు. తన కుమార్తె వివాహానికి రావాలని సుప్రియను మంత్రి ఆహ్వానించారు.

'స్వస్థ్ నారీ' పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ముదినేపలి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ నాయకుడు, ప్రముఖ వైద్యుడు డాక్టర్ సీఎల్ వెంకట్రావు కోరారు. మహిళల సంపూర్ణ ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన ఈ బహుళ వైద్య పథకాన్ని ప్రభుత్వ వైద్యులు కూడా అంకిత భావంతో అమలు చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. మహిళల్లో కేన్సర్ వ్యాధి స్క్రీనింగ్ పరీక్షల తోపాటు క్షయ తదితర వ్యాధులకు సంబంధించి నిర్వహిస్తున్న వైద్య పరీక్షలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.